www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 119 శనివారం, సెప్టెంబర్ 12, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
- పరాకాష్ఠకు చేరిన భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు
- అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు
- గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు
- రాష్ట్రంలో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం
- 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి'
- కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 11:** తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముదు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మిగతా2లో...

## ఉద్యోగులకు ప్రమాద బీమా

- కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
- ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ధి
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి



**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాన మిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు.

మిగతా2లో...



## వికృత రూపాలతో పోటీతత్వం

- రష్యా అధ్యక్షుడు పుతిన్
- స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్
- ఆర్థిక వారధులను నిర్మిస్తున్న భారత్: బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశాల్లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ ,సెప్టెంబర్ 11:** 20వ శతాబ్దం చివరి వరకు అగ్ర స్థానాల్లో వున్న దేశాల స్థానే కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థలు వచ్చి చేరుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. ఈ పోటీ ఇప్పుడు వికృత రూపాలను అంటే సైనిక దాడులు, ఆంక్షల బెదరింపులు వంటి రూపాలను సంతరిం చుకుం టోందని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

## అనలాగ్ పనీర్‌పై నిషేధం

నాన్-డెయిరీ పనీర్‌పై ఏడాది పాటు నిషేధం: టీజీసేఫ్ కీలక నిర్ణయం



**హైదరాబాద్ ,సెప్టెంబర్ 11:** ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలోఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విచ్చలవిడిగా చెలామణి అవుతున్న నకిలీ, కృత్రిమ పనీర్‌పై తెలంగాణ సేఫ్టీ ఆఫ్ ఫుడ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. తెలంగాణ వ్యాప్తంగా నాన్-డెయిరీ, అనలాగ్, ఆర్టిఫిషియల్ పనీర్ తయారీ, విక్రయాలపై ఏడాది పాటు పూర్తి నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పనీర్ పేరుతో అనలాగ్ లేదా నాన్-డెయిరీ పదార్థాలను తయారు చేయడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ చేయడం, పంపిణీ, రవాణా, విక్రయించడంపై రాష్ట్రవ్యాప్తంగా కఠిన నిషేధం అమలులో ఉంటుందని అధికారులు మిగతా2లో...

## రైతులు కోరుకున్న పనిముట్లే అందిస్తున్నాం

- సబ్సిడీ సొమ్ము నేరుగా వారి ఖాతాల్లోకే బదిలీ : మండలిలో మంత్రి తుమ్మల



**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధాన మిచ్చారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన మిగతా2లో...



## నాణ్యమైన విద్యే లక్ష్యం

- 'జెన్ ఆల్ఫా, జెన్ బీటా'కు సరిపడా విద్యా విధానం
- ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం
- సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తాం
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- అదే విద్యాశాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనం : విద్యా వ్యవస్థలో సంస్కరణలపై స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాలను కూడా దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో సరికొత్త విద్యా విధానాన్ని రూపొంది స్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మిగతా2లో...

## ఆర్మీ రిటైర్డ్ హవల్దారే నిందితుడు

- వీడిన ఆర్మీ ఆయుధాల చోరీ మిస్టరీ
- ఆయుధాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం : వివరాలు వెల్లడించిన డీజీపీ సీవీ ఆనంద్


2లో

## వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం

- వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం :రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


2లో

## చెరువుల హద్దులకు రక్షణ కవచం

- నెల్లికల్ ఎత్తిపోతల పథకం నుంచి ప్రారంభం
- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి
- 24 వేల ఎకరాల ఆయకట్టుకు జలాలు :శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 11** చెరువుల పూర్తి నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో పలువురు సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ఆరు వేలకుపైగా పెరిగాయని చెప్పారు. వాటిలో సభ్యత్వం 6.5 లక్షలకు చేరిందన్నారు. మిగతా2లో...



## రామగుండం బీపీఎల్ భూములను వెనక్కి తీసుకుంటాం

- 1800 ఎకరాల స్వాధీనానికి ప్రయత్నాలు : మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, 11 య:** రామగుండంలో బీపీఎల్ కు ఇచ్చిన 1800 ఎకరాలను తిరిగి తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం శాసనసభలో పలువురు సభ్యులు మిగతా2లో...

శనివారం,
సెప్టెంబర్ 12, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# ఉద్యోగులకు ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో సింగరేణిలో 50, విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.

# రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆ వ్యవస్థలోకి ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నామని ఆయన చెప్పారు. శుక్రవారం శాసన సభలో విద్యా వ్యవస్థలో సంస్కరణలపై నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం మాట్లాడారు. తెలంగాణ విద్యా విధానంపై సభలో చర్చ జరగడం ఒక శుభ పరిణామమని అన్నారు. చర్చ సందర్భంగా సభ్యుల నుంచి వచ్చే సూచనలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్ని స్తుందని హామీ ఇచ్చారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండు అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని ఏ విద్యా సంస్థ అయినా నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వేనని తెలిపారు. విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సీపెక్ సర్వేలో సామాజిక వెనుకబాటుకు ఆస్తులు, అంతస్తులు కాకుండా విద్య లేకపోవడమే కారణమని తేలిందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.
ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యా విధానంలో తీసుకు రావాల్సిన అంశంపై చర్చించాల్సిన అవసరం ఉందని అభి ప్రాయపడ్డారు. ఆ దిశగా విద్యా కమిషన్ ఏర్పాటు చేశామనీ, ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలిం చినట్టు తెలిపారు.
అనంతరం కె. కేశవరావు నేతృత్వం లో కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ కమిటీకి సభ్యులు సల హాలు, సూచ నలు అందిస్తే ప్రభు త్వం స్వీకరిం చేందుకు సిద్ధం గా ఉందని స్పష్టం చేశారు. విద్య కోసం బడ్జెట్ ను 15 శాతానికి పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2023-24 బడ్జెట్ లో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖ కు రూ.19,093 కోట్లు కేటాయిస్తే, తమ ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ.21,292 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. దానిని 2025-26 బడ్జెట్ లో రూ.23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ. 26,647 కోట్లకు పెంచినట్టు తెలిపారు.కేవలం మూడేండ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచామని వివరించారు. విద్యా శాఖకు పూర్తి స్థాయి మంత్రి లేరని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శిం చడాన్ని ప్రస్తావి స్తూ, ముఖ్య మంత్రి ఆ శాఖను నిర్వ హిస్తున్నా రంటే అది అత్యంత ప్రధాన మైనదని అర్థమని సీఎం తెలిపారు.ముఖ్య మంత్రిగా తాను విద్యపై సమీక్షిస్తే ఆ సమీక్షలో మొత్తం వ్యవస్థ ఉంటుందని చెప్పారు.ఆ మాత్రం తేడా కూడా సభ్యునికి తెలియకపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తనకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉందని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నే ఉందని, తలరాతలు మార్చేది విద్యా అని నమ్మి విద్యా శాఖ తన దగ్గర పెట్టుకున్నానని వివరణ ఇచ్చారు. ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొచ్చే క్రమంలో కొన్ని నిర్ణయాలు చేసినప్పుడు కొన్ని వివాదాలు తలెత్తుతాయంటూ, అలాంటిదే పాలిటె క్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.97 అని సీఎం ఉదహరించారు.

# చెరువుల హద్దులకు రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. తొలి దశలో వచ్చే ఏడాది జూన్ నాటికి 7,800 ఎకరాలకు, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ నాటికి నీరందిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదల చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.310.681 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మంత్రిగా తాను రెండు సార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు.

# వికృత రూపాలతో పోటీతత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రపంచంలో నిర్మాణాత్మకమైన, వ్యవస్థా గతమైన మార్పులకు లోనవుతోందని పుతిన్ అన్నారు. 20వ శతాబ్దం ద్వితీయా ర్ధంలో ఆర్థిక అభివృద్ధికి అగ్రగామిగా నిలిచిన దేశాల స్థానే క్రమేపీ నూతన అభివృద్ధి చోదక శక్తులు ఆక్రమిస్తున్నాయని పుతిన్ పేర్కొ న్నారు. అయితే ఈ దేశాలు ఇంకా బాగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలను, సాంకేతి కతను, శాస్త్రీయ అవకాశాలను కలిగివు న్నాయనే వాస్తవాన్ని మనం గుర్తిం చాలన్నారు. మానవాళి స్వభావం, ఆర్థిక వ్యవస్థ రెండూ మార్పు చెందుతునే వుంటా యన్నారు. ఈ మార్పుతో పాటూ రష్యాకు చెందిన పశ్చిమ దేశాల పోటీదారులు తమ పూర్వపు పోటీ తత్వాన్ని తిరిగి సముపార్జిం చుకునేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. అయితే ఈ పోటీతత్వం అనేది చాలాసార్లు వికృత చేష్టలతో ముడిపడి వుంటుందన్నారు. భౌతిక దాడులకు దిగడం, చమురు పైప్‌లైన్లు ధ్వంసం చేయడం, అంతర్జాతీయ రవాణా కారిడార్లను అడ్డుకోవడం,సముద్రపు నౌకలను స్వాధీనం చేసుకోవడం, అక్రమంగా ఇతరత్రా ఆంక్షలు విధించడం వంటి చర్యలకు దిగుతూం టారని అన్నారు. **స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్** అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడడం వల్ల ఎదురయ్యే ముప్పులు, ప్రమాదాల గురించి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రముఖంగా పేర్కొన్నారు. స్థానిక కరెన్సీల్లో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం పెరగాలని పిలుపిచ్చారు. ఆర్థిక భద్రతను దేశ, ప్రాంతీయ భద్రత నుండి ఎలా వేరుచేయలేమో తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడులు రుజువు చేశాయని అన్నారు. రాజకీయంగా ఒత్తిడి తీసుకురా వడానికి ఆర్థిక సాధనాలను ఉపయోగించడం పెరిగిందని అన్నారు. ఈనాడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ సవాళ్ళకు బ్రిక్స్ దేశాల స్పందన ఎలా వుండబోతోందో చెప్పాలని ఆయన అక్కడ వున్న నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. ఒక ఆర్థిక సాధనంపై లేదా సాంకేతికతపై గుత్తాధిపత్యాన్ని ప్రదర్శించడం ద్వారా ఏ దేశమూ మరో దేశం యొక్క చట్టబద్ధమైన వాణిజ్యాన్ని దెబ్బతీయలేని వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించాలని ఆయన కోరారు.

# అనలాగ్ పనీర్‌పై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. పాలతో కాకుండా రసాయనాలు,వెజిటబుల్ ఆయిల్స్, ఇతర కృత్రిమ పదార్థాలతో చేసే అనలాగ్ పనీర్ ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నిషేధాజ్ఞలు 2026 సెప్టెంబర్ 10 నుంచి తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని టీజీ సేఫ్ ప్రకటించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 లోని సెక్షన్ 30(2)(ఏ) కింద ఆధారాలు లభించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నకిలీ, అనలాగ్ పనీర్‌ను విక్రయించినా, నిల్వ చేసినా ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తప్పవని టీజీ సేఫ్ అధికారులు హెచ్చరించారు.

# ఆర్మీ రిటైర్డ్ హవల్దారే నిందితుడు

**హైదరాబాద్,సెప్టెంబర్ 11** :దేశంలోనే సంచలనం రేపిన మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ లోని ఆయుధాగారం నుంచి భారీ ఎత్తున ఆయుధాల చోరీ మిస్టరీని రాష్ట్ర పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడ్డ ఆర్మీ రిటైర్డ్ హవల్దార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ అయిన ఆయుధాలను స్వాధీన పర్చుకున్నారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో హవల్దారుగా పనిచేసిన ఉప్పుతోళ్ళ మల్లేష్ ఈ ఏడాది జూన్ నెలలో రిటైర్డ్ అయ్యారు. ప్రవర్తన సరిగా లేకపోవడంతో పాటు అనారోగ్య కారణాల వల్ల ఉన్నతాధికారులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. మద్రాస్ రెజిమెంట్ ఆయుధాగారాల నుంచి 7 పిస్టళ్లు , 4 ఏకే 47, ఇన్సాస్, మందుగుండు సామాగ్రి చోరీ జరిగిందని ఆగస్టు 30న ఆర్మీ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసును నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించాం. సమస్య తీవ్రత దృష్ట్యా రాష్ట్ర పోలీసులతో పాటు ఆర్మీ ఇంటెలిజెన్స్ అధికారులు, ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తును ప్రారంభించారు. రాష్ట్ర పోలీసు దర్యాప్తు బృందాలు బొల్లారంలోని ఘటనా స్థలాన్ని సందర్శించి అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించాయి.ఆయుధాగార ఇన్‌చార్జీలు వినోద్ నాయర్, మధు నాయర్లతో పాటు సెక్యూరిటీ గార్డ్స్, ఆ ప్రాంత పర్యవేక్షక ఆర్మీ అధికారులను ప్రశ్నించారు. ఆ సమయంలోనే వచ్చిన సమాచారం మేరకు జూన్ లో రిటైర్డ్ అయిన హవల్దార్ మల్లేష్ కదలికలపై దృష్టి సారించాం. మా దగ్గర ఉన్న ఆధారాలతో నిందితుడి కదలికల గురించి ప్రశ్నించాం. వాస్తవాలు చెప్పకుండా అతడు దాచిపెట్టాడు. తొలుత విచారణ కోసం మేం పిలిస్తే రాలేదు. ఫోన్ కాల్ లిస్ట్, వాట్సప్ చాటింగ్‌లు డిలీట్ అయ్యాయి. ఆ తర్వాత మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నప్పుడు ఆయన ముఖంలో చెమటలు పట్టి భయం కనిపించింది. కేసు తీవ్రతను ఆయన భార్యకు వివరించాం. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో నిందితుడు నిజం అంగీకరించాడు. చోరీ చేసిన ఆయుధాలను నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్లి గుంతతీసి పాతిపెట్టాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకున్నాం" అని డీజీపీ వివరించారు.

# వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తాం

**హైదరాబాద్,సెప్టెంబర్ 11 :** రాష్ట్రంలో 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ వారసు లకు న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో సీపీఐ సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. జీవో నెంబర్ 81 ప్రకారం మిగిలిన 3,797 మంది వీఆర్ఏ వారసులను ఉద్యోగంలోకి తీసుకునేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొన్ని న్యాయపరమైన చిక్కులు, ఇతర సమస్యల ను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని సభకు వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు నీడ కల్పిస్తున్నట్టు పొంగులేటి తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు మహేశ్‌కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ రాష్ట్రంలోని రూరల్ ఏరియాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫేజ్-1 కింద 4.5 లక్షలు, ఫేజ్-2 కింద 2.5 లక్షలు మంజూరు చేసినట్టు సభకు తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి రెండు విడతల్లో 5,500 ఇండ్లను అందించ నున్నట్టు తెలిపారు. అర్బన్ ఏరియాల్లో మొదటి సారిగా హైదరాబాద్‌లో లక్ష ఇండ్లను టవర్ల రూపంలో నిర్మించనున్నట్టు వెల్లడించారు. త్వరలో కరీంనగర్, వరంగల్, ఖమ్మం మొదలగు కార్పొరేషన్లలో ఈ పథకాన్ని వర్తింప జేయనున్నట్టు తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు ఇండ్ల పథకాలకు ఆర్థిక సాయం అందిస్తున్న కేంద్రం తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపించిందని విమర్శించారు.

# రామగుండం బీపీఎల్ భూములను వెనక్కి తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

అడిగిన వివిధ ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా బీపీఎల్ భూములపై కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని గ్లోబల్ సిటీగా మార్చుతామన్నారు. హైదరబాద్- బెంగళూరు హైవేని డిఫెన్స్ కారిడార్‌గా మార్చనున్నట్టు వెల్లడించారు. రైజింగ్ తెలంగాణలో వరంగల్‌కు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ 163 ఇండస్ట్రీయల్ కారిడార్‌పై తమ దృష్టి ఉందన్నారు. దావోస్‌లో రూ.2 లక్షల కోట్ల విలువ చేసే ఏడు ఎంఒయులు జరిగాయనీ, రైజింగ్ సమ్మిట్‌లో రూ.3.82 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు నమోదయ్యాయని వివరించారు. మొత్తంగా రూ.5.8 లక్షల కోట్ల పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారనీ, అయితే వారి ఫైనాన్సీయల్ క్లోజర్‌తో ఈ పెట్టుబడులు ముడిపడి ఉంటాయని తెలిపారు.

# రైతులు కోరుకున్న పనిముట్లే అందిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాతే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదనీ, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు.దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవనీ, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో వారికి కూడా భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని చెప్పారు.**ఇమామ్‌ల వేతనం పెంపు పరిశీలనలో ఉంది.... : ?మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్** ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనం పెంపు పరిశీలనలో ఉందని మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం వారి గౌరవ వేతనం రూ.5 వేలుగా ఉందని తెలిపారు. గౌరవ వేతనం అందని ఇమామ్, మౌజమ్‌లకు సంబంధించి సమాచారాన్ని ఇస్తే వారికి కూడా అందజేస్తామని పేర్కొన్నారు.

# దళితులను అవమానించిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

**పోలీస్ స్టేషన్లలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు**







**మల్కాజిగిరి: సెప్టెంబర్ 11 (పీపుల్స్ న్యూస్)**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులను అవమానించారనే ఆరోపణలపై బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దళితులను అవమానించేలా వ్యవహరించిన వారిపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద భాస్కర్, జాన్సన్, బి-బ్లాక్ అధ్యక్షుడు రొట్టెల ధరన్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నవీన్, సత్యం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో 23 మంది సిబ్బంది ప్రాణత్యాగం
- అటవీ భూముల ఆక్రమణలపై కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలి: డీజీపీ సి.వి. ఆనంద్
- అటవీ సిబ్బందికి ఆయుధాలు అందించాలి: మంత్రి జూపల్లి







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 11 (పీపుల్స్ న్యూస్)**

సహజ వనరులు, అటవీ సంపద, వన్యప్రాణుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అటవీశాఖ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో విధులు నిర్వహిస్తూ రాష్ట్రంలో ఇప్పటివరకు 23 మంది అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 11న పాల్వంచలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని ఎఫ్‌బీవో బానోతు నవీన్ ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఆయన గుర్తుచేశారు. నవీన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



**ప్రమాదకరంగా అటవీ సిబ్బంది విధులు**

అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అడ్డుకునే క్రమంలో అటవీ సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని పర్యాటక, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అటవీ సిబ్బందికి అవసరమైన ఆయుధాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అడవుల నరికివేత, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం పర్యావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం చూపుతోందని మంత్రి పేర్కొన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

**అడవుల రక్షణకు సమన్వయం**

అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు. భవిష్యత్ తరాలకు మిగిలి ఉన్న అటవీ ప్రాంతాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మానవ తప్పిదాల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేసిన డీజీపీ.. హిమాలయాల్లో ప్రకృతి విపత్తులు, యూరప్‌లో అడవుల్లో అగ్నిప్రమాదాలు పర్యావరణ మార్పుల తీవ్రతను తెలియజేస్తున్నాయని అన్నారు.

**అటవీ సిబ్బందికి ఆయుధాలు**

గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించే సమయంలో అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉండేవి కావని డీజీపీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమైన ఆయుధాలు అందిస్తే అటవీ సిబ్బంది మరింత సమర్థంగా విధులు నిర్వర్తించగలరని అన్నారు. అటవీశాఖకు పోలీసుశాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**ఖేజర్లీ ఘటనకు గుర్తుగా అమరవీరుల దినోత్సవం**

రాజస్థాన్‌లోని ఖేజర్లీ ప్రాంతంలో చెట్లు, పర్యావరణాన్ని కాపాడేందుకు 1730లో 363 మంది విష్ణోయి తెగ ప్రజలు ప్రాణత్యాగం చేసిన ఘటనకు గుర్తుగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ వివరించారు. పోలీసుశాఖలో అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించినట్లే.. అటవీశాఖ సిబ్బంది త్యాగాలను స్మరించుకునేందుకు సెప్టెంబర్ 11 ప్రత్యేకమైన రోజన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్‌కుమార్, టీజీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ సునీత ఎం. భగవత్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, సెక్రటరీ ప్రియాంక వర్గీస్, పోలీసు, అటవీశాఖ అధికాయిలు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు చేయాలి



**హుజురాబాద్ సెప్టెంబర్ 11** విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్‌లోని కళాశాలలో శుక్రవారం స్మార్ట్ ఇండియా 2026లో భాగంగా అంతర్గత పోటీలు నిర్వహించారు.కళాశాల స్థాయిలో 35 బృందాలు పాల్గొన్నాయని, ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈ. ప్రదీప్ వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎన్. రఘు, డాక్టర్ డి. ప్రశాంత్, డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్, ఈ. స్వప్న, దివ్యరాణి వ్యవహరించారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలి



**హుజురాబాద్ సెప్టెంబర్ 11**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. హుజురాబాద్‌లోని దర్శిని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం,రజాకార్ల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17 చారిత్రక దినమని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు.

కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, కనుమల గణపతి, రావుల భాస్కర్‌రెడ్డి, గంగిశెట్టి రాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, తూర్పాటి రాజు, పారుపల్లి కొండారెడ్డి, కొలగాని రాజు, దొంతర వేణి రమేష్, ర్యాకం శ్రీనివాస్, కౌన్సిలర్లు కొలుగూరి సుమలత, శీలం శ్రీనివాస్, సర్పంచ్ ఉప్పు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూడా చైర్మన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**హసన్ పర్తి సెప్టెంబర్ 11జోర్దార్ ప్రతినిధి**

కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గుండు సుధారాణిని కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి,కాంగ్రెస్ నాయకులు రామంచ ఐలయ్య,తాళ్ల మధు,గారిగె రాజు పాల్గొన్నారు.

# జమ్మికుంట ఉచిత వైద్య శిబిరం



**వీణవంక** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ డాక్టర్ భరత్ ,డాక్టర్ గ్రీష్మ, హిమ్మత్ నగర్ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులను పూర్తిగా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాంలో గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్, ఉప సర్పంచ్ మేక శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలకు ఆదిత్య, అమృత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలతో అల్ఫోర్స్‌లో వేడుకలు



**హుజురాబాద్, సెప్టెంబర్ 11**
హుజురాబాద్‌లోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి కులమతాలకు అతీతంగా ప్రజలను ఐక్యం చేసే పండుగ అన్నారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలి

**- నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలి: సీపీ వి.సి. సజ్జనర్**







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 11 (పీపుల్స్ న్యూస్)**
నగరంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. సీపీ వి.సి. సజ్జనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు సీపీలు ఎ. శ్రీనివాస్, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డేవిస్‌తో పాటు నగర పరిధిలోని డీసీపీలు పాల్గొన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్. శశిధర్, సలహాదారు కరోడిమాల్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి కోశాధికారి ఎం. మహేష్ యాదవ్, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి సాయి కిరణ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ హైదరాబాద్ గణేష్ ఉత్సవాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, దశాబ్దాలుగా ప్రజలు, ఉత్సవ కమిటీల సహకారంతో వేడుకలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది కూడా భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**ఆగమన సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి**
గణేష్ విగ్రహాల ఆగమన సమయంలో అధిక రద్దీ, వేగంగా వాహనాలు నడపడం, వాహనాలపై నృత్యాలు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సీపీ హెచ్చరించారు. విగ్రహాల ఆగమన సమాచారాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేసి, ట్రాఫిక్ తక్కువగా ఉండే సమయాల్లో సురక్షితంగా మండపాలకు తరలించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలు, రోడ్ల మరమ్మతులకు సంబంధించిన సమస్యలపై జీహెచ్ఎంసీ, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమన్వయం పూర్తయిందని తెలిపారు. త్వరలో పోలీస్ అధికారులు మార్గాలను పరిశీలిస్తారని వెల్లడించారు.

**మండపాల వద్ద వాలంటీర్లకు బాధ్యతలు**
ప్రతి గణేష్ మండపం వద్ద కనీసం 4 నుంచి 5 మంది బాధ్యతాయుతమైన వాలంటీర్లను ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. వారి వివరాలను పోలీస్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు ప్రత్యేక గుర్తింపు కోసం ఒకే రంగు దుస్తులు లేదా బ్యాడ్జీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

**శబ్ద కాలుష్యంపై నియంత్రణ అవసరం**
ఉత్సవాల సమయంలో శబ్ద కాలుష్యంపై ప్రజల నుంచి, ముఖ్యంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వృద్ధుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సీపీ తెలిపారు. భక్తి, ఉత్సాహంతో వేడుకలు జరుపుకుంటూనే ఇతరులకు ఇబ్బంది కలగకుండా ధ్వని పరికరాల వినియోగాన్ని పరిమితుల్లో ఉంచాలని కోరారు.

**ఉదయమే నిమజ్జన ఊరేగింపులు ప్రారంభించాలి**
ప్రధాన నిమజ్జనం రోజున మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఊరేగింపులు కొనసాగడం వల్ల ప్రజలు, ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీ పేర్కొన్నారు. అందువల్ల నిర్వాహకులు నిమజ్జనం రోజున ఉదయమే ఊరేగింపులు ప్రారంభించేలా ప్రోత్సహించాలని సమితి ప్రతినిధులను కోరారు.

**ఖైరతాబాద్, బాలాపూర్‌పై ప్రత్యేక దృష్టి**
ఖైరతాబాద్ బడా గణేష్, బాలాపూర్ ప్రాంతాల్లో భారీగా రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తారని వెల్లడించారు. ప్రజలు, నిర్వాహకుల్లో అవగాహన పెంచేందుకు పోలీస్ స్టేషన్ల వద్ద సమాచార బ్యానర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీస్ శాఖ సమన్వయంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా గణేష్ మహా ఉత్సవాలను విజయవంతం చేయాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# గణపతి ఉత్సవాల్లో పోలీసుల నిబంధనలు తప్పనిసరి

**- అనుమతి లేకుండా డీజేలు, అధిక శబ్దానికి అనుమతి లేదు**
**- అయిజ ఎస్సై గురు స్వామి**



**జోగులంబ గద్వాల సెప్టెంబర్ 11**
గణపతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని అయిజ ఎస్సై గురు స్వామి సూచించారు. గణపతి మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, అనుమతి లేని డీజేలు, అధిక శబ్దం, రాత్రి వేళల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. గణపతి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలను పోలీసులు సూచించిన మార్గం, సమయాల్లోనే నిర్వహించాలని సూచించారు. అలాగే మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఎస్సై గురు స్వామి తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.

# ఐక్యంగా ఉందాం అన్ని సాధించుకుందాం

**పొదుపు ద్వారా అనేక లాభాలు**





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(పీపుల్స్ న్యూస్)**
జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా పాత్రికేయులందరం ఐక్యంగా ఉండి సమస్యల సాధన కోసం పోరాటం చేద్దామని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మీడియా పాత్రికే సోదరులందరూ కలిసికట్టుగా ఉందామని పవర్ ఆఫ్ ప్రింట్ మీడియా ఆత్మీయ వేదిక నిర్ణయించింది. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ దేవాలయం వద్ద ప్రింట్ మీడియా ఆత్మీయ వేదిక సమావేశం భేతి సతీష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ గత కొద్ది కాలంగా ప్రింట్ మీడియా పాత్రికేయులు అందర్నీ ఒక తాటిపై తీసుకురావడానికి కృషి చేస్తున్న క్రమంలో శుక్రవారం బీజం పడిందని , ఇదే ఐక్యతను ముందుకు సాగించాలని అన్నారు. పాత్రికేయుల ఆర్థిక సమస్యలు తీర్చుకోవడానికి పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి నెల నెల ప్రతి ఒక్క పాత్రికేయుడు పొదుపు డబ్బులు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాత్రికేయుల సమావేశాలను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భంగా పత్రిక సమావేశాలను ప్రింట్ మీడియా కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించే విధంగా చూసుకోవాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో పాత్రికేయులు సుంకర సంపత్, గుర్రపు శ్రీధర్, కే. రాజిరెడ్డి, గూడూరు మహిపాల్ రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి మామిండ్ల సంపత్ గౌడ్ కేసరి బిక్షపతి జిలకల ప్రభాకర్ ఎనగందుల కొమురయ్య కిరణ్ రాజేష్ రాజవర్ధన్ నటరాజ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.




# రాజోలి పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల సమావేశం



**జోగులాంబ గద్వాల సెప్టెంబర్ 11**
రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మధుబాబు ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. విధుల్లో సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలకు టీకాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, ఎన్‌సీడీ క్యాంపుల ద్వారా బీపీ, షుగర్ బాధితుల గుర్తింపు, డ్రై డే పాటింపు, లెప్రసీ సర్వే, టీబీ బాధితుల ఫాలోఅప్‌పై అవగాహన కల్పించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు సమర్థంగా అందేలా పనిచేయాలని సూచించారు.

# విజ్ఞాన్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే

**హుజురాబాధ్ సెప్టెంబర్ 11**
హుజురాబాద్ పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుమారు 150 మంది తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు పాల్గొని విద్యార్థులతో కలిసి ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వరి యాదవ్ మాట్లాడుతూ.. పిల్లలకు క్రమశిక్షణతో పాటు కుటుంబ విలువలు, నైతికతను నేర్పడంలో తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు శాలువాలు కప్పి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడ్వైజర్ గంజి జయవర్ధన్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# రాజకీయ నేత సహచరుడిగా నకిలీ గుర్తింపు.. అంతరాష్ట్ర నిందితుడి అరెస్ట్

**- రాజకీయ పదవులు, అనుకూలతల పేరుతో మోసం.. 14 మంది బాధితుల నుంచి రూ.3 కోట్ల నగదు, బంగారం సేకరణ**



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 11 (పీపుల్స్ న్యూస్)** ప్రముఖ రాజకీయ నాయకుడి సహచరుడిగా నకిలీ గుర్తింపు పొందుతూ పలువురిని మోసం చేసిన అంతరాష్ట్ర నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని పాటియాలా సెంట్రల్ జైలులో ఉన్న నిందితుడిని ప్రొడక్షన్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చి అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని లిగౌరవ్ కుమార్ అలియాస్ గోరా (45)లిగా పోలీసులు గుర్తించారు. పంజాబ్‌లోని అమృత్సర్ ప్రాంతానికి చెందిన అతడిని అక్కడి కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేసులో పంజాబ్ పోలీసులు ముందుగా అరెస్ట్ చేసి పాటియాలా సెంట్రల్ జైలులో ఉంచారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సెప్టెంబర్ 10న పీటీ వారెంట్‌పై అతడిని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

### కనిష్క్ సింగ్ పేరుతో మోసం

పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 1న ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ కుమార్ నుంచి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందింది. గుర్తుతెలియని వ్యక్తి ఒక మొబైల్ నంబర్‌ను ఉపయోగించి ప్రముఖ రాజకీయ నాయకుడి రాజకీయ సహచరుడు కనిష్క్ సింగ్‌గా నకిలీ గుర్తింపుతో సంప్రదిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.వాట్సాప్ కాల్స్, సందేశాల ద్వారా సంప్రదించిన నిందితుడు తానే కనిష్క్ సింగ్ అని నమ్మిస్తూ.. డబ్బు, బంగారం ఇస్తే రాజకీయ పదవులు, మద్దతు, అనుకూలతలు కల్పిస్తానంటూ ఆశ చూపినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుతో పాటు అందించిన కాల్ వివరాలు, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడికి ఎలాంటి నగదు నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

### 14 మంది నుంచి రూ.3 కోట్ల మేర వసూళ్లు?

పోలీసుల దర్యాప్తు ప్రకారం నిందితుడు ఇదే తరహాలో వివిధ రాష్ట్రాల్లో పలువురు రాజకీయ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడైంది. రాజకీయ నాయకుల సహచరుడిగా పరిచయం చేసుకుని, ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన పలువురిని వాట్సాప్ ద్వారా సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. రాజకీయ మద్దతు, పదవులు, అనుకూలతలు కల్పిస్తానని నమ్మించి డబ్బు, బంగారం ఇవ్వాలని ప్రేరేపించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలకు చెందిన 14 మంది బాధితుల నుంచి సుమారు రూ.3 కోట్ల నగదు, బంగారు ఆభరణాలనుసేకరించినట్లుపోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు.

### తెలియని నంబర్లతో అప్రమత్తంగా ఉండాలి

రాజకీయ నాయకులు, వారి సహచరులు, ప్రతినిధుల పేర్లతో డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు కోరే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు సూచించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఎవరైనా రాజకీయ పదవి, మద్దతు లేదా ఇతర ప్రయోజనాలు కల్పిస్తామంటూ డబ్బులు కోరితే అధికారిక మార్గాల్లో వారి గుర్తింపును నిర్ధారించుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలు, స్క్రీన్‌షాట్లు, ఫోన్ నంబర్లు, లావాదేవీల వివరాలను భద్రపరచాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని, లేదా "జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్" (https://reference-url-citation.invalid/0) ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

# పెద్దపల్లి ఎక్సైజ్‌లో మహిళా అధికారుల హవా

**నాలుగు స్టేషన్లకు నూతన అధికారులు.. ముగ్గురు మహిళా అధికారులే గంజాయి, గుడుంబా, నకిలీ మద్యంపై ఉక్కుపాదం**




**పెద్దపల్లి** పెద్దపల్లి జిల్లాలో ఎక్సైజ్ శాఖకు నూతన అధికారులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్లను ప్రభుత్వం బదిలీ చేయగా, ముగ్గురు మహిళా అధికారులు బాధ్యతలు చేపట్టడంతో ఎక్సైజ్ శాఖలో మహిళా అధికారుల ప్రాధాన్యం మరోసారి చాటుకుంది.పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా నల్ల రజిత, సుల్తానాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా రూప, రామగుండం ఎక్సైజ్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా నోముల సరిత బాధ్యతలు స్వీకరించారు. మంథని ఎక్సైజ్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా చంద్రమోహన్ విధుల్లో చేరారు. దీంతో జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లకు నూతన అధికారులు కొలువుదీరారు.నల్ల రజిత, రూప, నోముల సరిత యువ మహిళా అధికారులు కావడంతో ఎక్సైజ్ శాఖలో కొత్త ఉత్సాహం నెలకొంది. నూతన అధికారుల బాధ్యతల స్వీకరణపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గంజాయి, గుడుంబా, నకిలీ మద్యం, అక్రమ మద్యం రవాణా, విక్రయాలను పటిష్టంగా అరికట్టడంతో పాటు నాన్‌పెయిడ్ మద్యం జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని నల్ల రజిత, రూప, నోముల సరిత, చంద్రమోహన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమన్వయంతో పనిచేస్తూ ఎక్సైజ్ శాఖను మరింత పటిష్టం చేస్తామని పేర్కొన్నారు.

# హామీల కొండ.. అమలులో శూన్యం!

**- రూ.15 లక్షల నుంచి 'అచ్చే దిన్' వరకు.. కేంద్రంపై ప్రతిపక్షాల తీవ్ర విమర్శలు**

**- 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ? 2022 పక్కా ఇళ్లు ఏమయ్యాయి? బుల్లెట్ రైలు ఎక్కడ ఆగింది?**

**వరంగల్, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్,10 (పీపుల్స్ న్యూస్)** న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో ప్రజల ముందుంచిన భారీ హామీలు.. పదేళ్లు దాటినా పూర్తి స్థాయిలో అమలుకాలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, విమర్శకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు, ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు, 100 స్మార్ట్ సిటీలు, 2022 నాటికి అందరికీ పక్కా ఇళ్లు, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడం వంటి హామీలపై ప్రజల్లో ఇప్పటికీ ప్రశ్నలు ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### రూ.15 లక్షలు ఎక్కడ?

విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న ప్రచారంపై ఇప్పటికీ రాజకీయంగా తీవ్ర చర్చ కొనసాగుతోంది. అదే విధంగా ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాల హామీపై యువత నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయని విమర్శకులు అంటున్నారు.

### స్మార్ట్ సిటీల నుంచి బుల్లెట్ రైలు వరకు..

దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీల అభివృద్ధి, 2022 నాటికి అందరికీ పక్కా ఇళ్లు, బుల్లెట్ రైలు వంటి లక్ష్యాలు ప్రకటించినప్పటికీ, నిర్ణయించిన గడువుల్లో అన్ని లక్ష్యాలు పూర్తికాలేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో ప్రారంభ తేదీ, పూర్తి గడువు పలుమార్లు మారడాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

### ధరల మంట.. సామాన్యుడి జేబుకు చిల్లు!

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "మంచి రోజులు" వస్తాయని చెప్పిన ప్రభుత్వ పాలనలో సామాన్యుడి ఖర్చులు మాత్రం పెరిగాయని ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శిస్తున్నాయి.

### 'న ఖావూంగా.. న ఖానే దూంగా' నినాదంపై ప్రశ్నలు

అవినీతిని సహించబోమని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వంపై కూడా ప్రతిపక్షాలు పలు సందర్భాల్లో అవినీతి ఆరోపణలు చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు రాజకీయ పార్టీల పరస్పర విమర్శల్లో భాగమని, ప్రతి కేసును వాస్తవాల ఆధారంగా విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.గంగా ప్రక్షాళన.. లక్ష్యం ఇంకా దూరమేనా?గంగా నది ప్రక్షాళన కోసం భారీ స్థాయిలో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, నది పూర్తిగా పరిశుభ్రంగా మారిందని చెప్పే పరిస్థితి లేదని విమర్శకులు అంటున్నారు.5 ట్రిలియన్ డాలర్ల కల.. గడువు దాటినా లక్ష్యం అసంపూర్తి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం కూడా నిర్ణయించిన గడువులో సాధ్యం కాలేదని విమర్శలు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగినా, ప్రకటించిన నిర్దిష్ట గడువు మరియు లక్ష్యంపై మాత్రం ప్రశ్నలు మిగిలాయని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.రూపాయి విలువపై ఆందోళనడాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా పడిపోవడం కూడా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విమర్శలకు కారణమవుతోంది. దిగుమతులపై ఆధారపడే దేశంలో రూపాయి బలహీనత సామాన్యులపై పరోక్షంగా ధరల భారాన్ని పెంచుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

### హామీలకు లెక్క చెప్పాల్సిందే!

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అచ్చే దిన్ అంటూ ఆశలు రేకెత్తించి.. హామీల అమలుపై మాత్రం ఎప్పటికప్పుడు కొత్త వివరణలు ఎందుకు? అంటూ కేంద్రాన్ని నిలదీస్తున్నాయి. దేశ ప్రజలు ఇప్పుడు మాటలు కాదు.. హామీల అమలుకు స్పష్టమైన లెక్కలు, గడువులు, ఫలితాలు కావాలని కోరుతున్నారని విమర్శకులు పేర్కొంటున్నారు.

# చేయూత పెన్షన్లకు కొత్త నిబంధనలు

**(హైదరాబాద్** చేయూత పెన్షన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఒంటరి మహిళలకు ఆర్థిక సాయం మంజూరులో నిబంధనలను సవరించింది. విడిపోయిన కాలానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో స్థానిక విచారణ నిర్వహించే అధికారుల పరిధిని ప్రభుత్వం విస్తరించింది.ఇకపై తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లను కూడా స్థానిక విచారణ అధికారులుగా ప్రభుత్వం చేర్చింది. అర్హులైన వారికి చేయూత పెన్షన్లు అందేలా సెర్ప్ ప్రతిపాదనల మేరకు నిబంధనల్లో మార్పులు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# రామప్పలో పర్యాటకుల ఆశలు ఆవిరి!

**- యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ క్షేత్రంలో గడ్డి పెరిగినా పట్టించుకోరా?**

**- ఐదేళ్ల బాలుడి మెడలోని రూ.1.70 లక్షల విలువైన చైన్ మాయం గంటల తరబడి వెతికినా లభించని వైనం**





**(రామప్ప, )ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 (పీపుల్స్ న్యూస్)** ప్రపంచ వారసత్వ సంపదగా, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలకు తాజాగా చోటుచేసుకున్న ఘటన ఉదాహరణగా నిలిచింది. ఎంతో భక్తిశ్రద్ధలతో తమ ఐదేళ్ల కుమారుడి పుట్టినరోజు వేడుకలను రామప్పలో ఆనందంగా జరుపుకోవాలని సుదూర ప్రాంతం నుంచి వచ్చిన ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది.

దైవదర్శనం అనంతరం పురావస్తు శాఖకు చెందిన గార్డెన్‌లో కుటుంబ సభ్యులు సేదతీరుతుండగా, ఐదేళ్ల బాలుడు ఆడుకుంటున్న సమయంలో అతని మెడలో ఉన్న సుమారు రూ.1.70 లక్షల విలువైన చైన్ కనిపించకుండా పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై గార్డెన్‌లో చైన్ కోసం గాలింపు చేపట్టారు. సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పాటు కుటుంబ సభ్యులతో పాటు అక్కడి సిబ్బంది, ఇతరులు కూడా వెతికినా చైన్ ఆచూకీ లభించలేదు.

### గడ్డితో నిండిన గార్డెన్.. పర్యవేక్షణ ఎక్కడ?

స్థానికుల కథనం ప్రకారం గార్డెన్‌లో గత మూడు, నాలుగు నెలలుగా గడ్డి ఏపుగా పెరిగి ఉండటంతో వస్తువులు పడిపోయినా గుర్తించడం కష్టంగా మారింది. పర్యాటకులు, భక్తులు సేదతీరే ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం నిర్వహణ లోపాలకు అద్దం పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంతోషంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని రామప్పకు వచ్చిన కుటుంబానికి విలువైన చైన్ పోవడంతో ఆ ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, గడ్డి తొలగింపు, నిరంతర పర్యవేక్షణ, భద్రతా చర్యలు వంటి కనీస సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పర్యాటకులు, భక్తులు కోరుతున్నారు.యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ ప్రఖ్యాత రామప్ప క్షేత్రానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# జమ్మికుంట ఎక్సైజ్ సీఐగా రామగిరి వాసి సమ్మయ్య

**ఉపాధ్యాయుడి నుంచి ఎక్సైజ్ అధికారిగా.. ఉత్తమ ర్యాంకుతో ఉద్యోగం**




**జమ్మికుంట** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలానికి చెందిన సమ్మయ్య జమ్మికుంట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జమ్మికుంట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఆయన విధుల్లో చేరారు.రామగిరి మండలానికి చెందిన సమ్మయ్య గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం పొందారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ పదోన్నతి పొందారు. తాజాగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జమ్మికుంట బాధ్యతలు చేపట్టారు.నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సమ్మయ్యకు జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాల ప్రజలు స్వాగతం పలికారు. తన పరిధిలో ఎక్సైజ్ శాఖను మరింత పటిష్టంగా నిర్వహించడంతో పాటు అక్రమ మద్యం, గుడుంబా, గంజాయి, నకిలీ మద్యం తదితర కార్యకలాపాల నియంత్రణకు కృషి చేస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సద్గుణాలు కలిగిన వారితోనే మాట్లాడాలి- వారితోనే స్నేహం

**ఢిల్లీ:** బ్రిక్స్ సదస్సు కోసం దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. వివిధ దేశాల నేతల రాక ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రపంచ సంక్షేమాన్ని కాంక్షిస్తూ సదస్సులో సానుకూల, అర్థవంతమైన చర్చలు జరుగుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "బ్రిక్స్ సదస్సు కోసం రానున్న రెండు, మూడు రోజుల్లో ప్రపంచంలోని పలు దేశాల నేతలు భారత్‌లో పర్యటించనున్నారు. ప్రపంచ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ అంశాలపై అర్థవంతమైన చర్చలు జరుగుతాయని నమ్ముతున్నాను. సద్గుణాలు కలిగిన వారితోనే మాట్లాడాలి. వారితో కలిసి పనిచేయాలి. వారితోనే చర్చలు, స్నేహం కొనసాగించాలి. దుర్గుణాలు కలిగినవారికి దూరంగా ఉండాలి" అని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, శని, ఆదివారాల్లో ఢిల్లీలో బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి భారత్‌కు రానున్న పలువురు దేశాధినేతలతో ప్రధాని మోదీ నేడు ద్వైపాక్షిక చర్చలు



నిర్వహించనున్నారు. మరోవైపు అమెరికాలో 2001 సెప్టెంబర్ 11న జరిగిన ఉగ్రదాడులకు 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్వామి వివేకానంద చారిత్రక ప్రసంగాన్ని గుర్తుచేసుకున్నారు. 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో పార్లమెంటులో వివేకానంద చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, సహనం, విశ్వ ఆమోదం, సామరస్యం వంటి ఆయన సందేశాలు నేటికీ ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 1893 సెప్టెంబర్ 11న చికాగోలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం భారతదేశ నాగరికతా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అన్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన మాటలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. వివేకానంద చేసిన ప్రసంగంలోని కొన్ని భాగాలను మోదీ తన పోస్టులో ప్రస్తావించారు. ప్రపంచానికి సహనం, విశ్వ ఆమోదాన్ని బోధించిన మతానికి చెందినందుకు గర్వపడుతున్నానని వివేకానంద చెప్పిన మాటలను గుర్తు చేశారు. అన్ని మతాలను సత్యంగా అంగీకారత్ ఆశ్రయం ఇచ్చిందని తెలిపారు. మతాల మధ్య విభేదాలు, మతోన్మాదం, హింసకు వ్యతిరేకంగా కూడా ఆయన మాట్లాడారు. ఆయన అన్ని మతాలను అంగీకరిస్తామని అన్నారు. ఎవరు ఏ రూపంలో వచ్చినా చివరికి ఆయన వద్దకే చేరుకుంటాయనే భావనను వివరించారు. ఇదిలా ఉండగా 2001 సెప్టెంబర్ 11న అమెరికాలో జరిగిన ఉగ్రదాడుల్లో అల్‌ఖైదాకు చెందిన 19 మంది ఉగ్రవాదులు అమెరికాపై దాడిలో భాగంగా నాలుగు విమానాలను హైజాక్ చేశారు. వాటిలో రెండు విమానాలు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఢీకొన్నాయి. మరో విమానం వర్జీనియాలోని ఆర్లింగ్టన్‌లో ఉన్న పెంటగాన్‌ను ఢీకొట్టింది. నాలుగో విమానం మాత్రం ప్రయాణికులు, సిబ్బంది నియంత్రణను తిరిగి పొందేందుకు ప్రయత్నించిన తర్వాత పెన్సిల్వేనియాలోని షాంక్స్‌విల్ సమీపంలో కూలిపోయింది. ఈ దాడుల్లో అమెరికా అధికారిక గణాంకాల ప్రకారం 2,977 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విధానాలు, సైనిక కార్యకలాపాలు, దేశీయ భద్రతా చర్యల్లో భారీ మార్పులకు దారితీసింది. ఆ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమెరికా ఏటా స్మరించుకుంటోంది. న్యూయార్క్‌లోని గ్రౌండ్ జీరో వద్ద బాధితుల కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొనే స్మరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మృతుల పేర్లను కుటుంబ సభ్యులు, సన్నిహితులు బిగ్గరగా చదువుతారు.

# కశ్మీరీలను జైలుకు పంపాలనుకుంటున్నారా.. కాంగ్రెస్‌పై ఒమర్ అబ్దుల్లా ఫైర్..




**జమ్మూకశ్మీర్ :** వందేమాతరం పూర్తి గేయం ఆలాపనపై కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. జమ్మూకశ్మీర్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ చేసిన విమర్శలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా స్పందించారు. 'కశ్మీరీలను జైలులో పెట్టాలని కాంగ్రెస్ కోరుకుంటుందా?' అంటూ ప్రశ్నించారు . పూర్తి 'వందేమాతరం' ఆలాపనపై ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనలను పాటించాల్సిందేనని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. కాగా, స్వాతంత్ర్య సమరయోధుల నిర్ణయాలను గౌరవిస్తూ పాటలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తమ కూటమి భాగస్వామి అయిన నేషనల్ కాన్ఫరెన్స్‌కు సూచించారు. అయితే కాంగ్రెస్ సూచనను పక్కన పెట్టి ఫిల్మ్ ఫెస్టివల్‌లో వందేమాత్రం పూర్తి గేయాన్ని ఆలపించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది

'అధికారిక కార్యక్రమాల్లో పూర్తి 'వందేమాతరం'ను ఆలపించడం తప్పనిసరి ఈ అంశంపై కాంగ్రెస్‌కు అభ్యంతరం ఉంటే పార్లమెంట్‌లో చట్టం ఏర్పడకుండా అడ్డుకోవాల్సింది. మా పార్టీ పూర్తి 'వందేమాతరం'ను ఎప్పుడూ అధికారికంగా స్వీకరించలేదు. భవిష్యత్తులోనూ స్వీకరించబోదు. అయితే ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం, నిబంధనలను మాత్రం పాటిస్తాం. జాతీయ గేయాన్ని ఆలపించే సమయంలో గౌరవ సూచకంగా నిలబడకపోతే చట్టపరమైన చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. జాతీయ గేయాన్ని అగౌరవపరిచి మేమందరం జైలుకెళ్లాలని కాంగ్రెస్ కోరుకుంటోందా' అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు.

# ఢిల్లీ బస్సులో గ్యాంగ్ రేప్.. 3 నెలల్లో ఆ బస్సుకు 12 సార్లు జరిమానా

**మథుర:** ఢిల్లీలో ప్రైవేటు స్లీపర్ బస్సులో సామూహిక అత్యాచార ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గ్రేటర్ నోయిడాకు ప్రయాణిస్తున్న 16 ఏళ్ల బాలికపై.. స్లీపర్ బస్సు డ్రైవర్, కండెక్టర్ గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన ఆగస్టు 4వ తేదీన జరిగింది. అయితే ఆ బస్సును ఏప్రిల్‌లో ఫిరోజాబాద్‌లో రిజిస్టర్ చేశారు. గడిచిన మూడు నెలల్లో ఆ బస్సు 12 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడింది. ఆ అంశంలో 12 సార్లు బస్సుకు జరిమానా విధిం చినట్లు పోలీసులు వెల్లడించారు. దీంట్లో యమునా ఎక్స్‌ప్రెస్‌వే మీదే 9 సార్లు ఉల్లంఘన జరిగినట్లు తెలిపారు. దాదాపు అన్ని సార్లు ఓవర్ స్పీడింగ్ కింద ఫైన్ వేశారు. నోయిడాలోని సెక్టార్ 63కు వెళ్లేందుకు 16 ఏళ్ల బాలిక ఖూ 83 జు 3789 బస్సు ఎక్కింది. అయితే ఆ బస్సులో అత్యాచారానికి పాల్పడిన తర్వాత ఆమెను ఢిల్లీలోని కశ్మీర్ గేటు వద్ద నిందితులు వదిలేశారు. కశ్మీర్ గేట్ పోలీసు స్టేషన్‌లో ఆ బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బస్సును



సీజ్ చేశారు. డ్రైవర్ కుల్దీప్, కండెక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. ఆ ఇద్దరూ కాన్పూర్ వాసులే. స్లీపర్ బస్సుకు మథురలోనే 8 చలాన్లు జారీ అయినట్లు ఏఎస్పీ సురేశ్ చంద్ర రావత్ తెలిపారు. ఆ బస్సు మీద మొత్తం 63వేల ఫైన్ ఉన్నదని పోలీసులు వెల్లడించారు. వరుసగా ఆరు రోజు ఓవర్ స్పీడ్ వల్ల 24 వేల ఫైన్ పడింది. ఓ సారి అక్రమ పార్కింగ్, హైవేపై ప్రయాణికుల్ని ఎక్కించుకోవడం లాంటి ఫైన్ కూడా ఉన్నది. రిఫ్‌లెక్టర్ టేప్‌తో పాటు ఇతర అంశాల్లోనూ ఆ బస్సుకు ఫైన్ పడింది.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదాలు- 15 మంది మృతి!

మహారాష్ట్రలో వరుస రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. భండారా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ట్రక్కు, పికప్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు నాందేడ్ జిల్లాలో గ సాయంత్రం ప్యాసింజర్ వ్యాన్, ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. రెండు ప్రమాదాల్లో కలిపి 15 మంది ప్రాణాలు కోల్పోయారు. భండారాలో ఘోర ప్రమాదంభండారా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లఖ్నీ తాలూకాలోని మనేగావ్, పింపల్గావ్ మధ్య జాతీయ రహదారి-53పై ఉదయం 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ట్రక్కు, పికప్ వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు పిల్లలతో సహా కనీసం తొమ్మిది మంది మృతి చెందారు. కొంతమంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పికప్ వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన



ఓ మహిళను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. ఆ కార్యక్రమానికి వెళ్తుండగాప్రమాదానికి గురైన పికప్ వాహనంలో ఉన్నవారు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్తున్నారు. ఓ మతపరమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు జాతీయ రహదారి-53 మీదుగా ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓ పెట్రోల్ పంప్ నుంచి ట్రక్కు హైవేపైకి ప్రవేశించే సమయంలో వేగంగా వస్తున్న పికప్ వాహనం డ్రైవర్ అదుపు తప్పాడు. దీంతో పికప్ వాహనం ట్రక్కును ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి వాహనం తీవ్రంగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న పలువురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే గడేగావ్‌లోని హైవే పోలీస్ అసిస్టెన్స్ సెంటర్ అధిపతి రవీంద్ర రేవాత్కర్ తన బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక గ్రామస్థుల సహాయంతో వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీశారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన తర్వాత పికప్ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలింపు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నాందేడ్‌లో మరో ఘోరం మహారాష్ట్రలో మరోవైపు నాందేడ్ జిల్లాలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాందేడ్-భోకర్ రహదారిపై సీతాఖండి సమీపంలో సాయంత్రం 7 గంటల సమయంలో ప్యాసింజర్ వ్యాన్, ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణికులతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వ్యాన్ నాందేడ్ నుంచి భోకర్ వైపు వెళ్తోంది. మార్గమధ్యంలో సీతాఖండి ఘాట్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రక్కు వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ట్రక్కు వేగంగా వచ్చి ఢీకొనడంతో వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. వ్యాన్‌లో చిక్కుకున్న క్షతగాత్రులు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వ్యాన్‌లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి అత్యవసర చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# బ్రిక్స్' సదస్సు వేళ ఢిల్లీలో హై అలర్ట్:

**ఢిల్లీ:** ఢిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సుకు ఎలా ంటి ఆటంకం రాకుండా పోలీసులు, కేంద్ర భద్రతా, నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా ఇంటెలిజెన్స్ బ్యూరో నుంచి వచ్చిన హెచ్చరికలతో దేశ రాజధానిలో నిఘాను మరింత పెంచారు. వీవీఐపీల రాకపోకలకు సంబంధించిన మార్గాల్లో భద్రతా ఏర్పాట్లను దాటుకుని లోపలికి చొరబడటం, నిరసనలు, గ్రాఫిటీ, డ్రోన్లతో ఇబ్బందులు సృష్టించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల ముఖ్య నేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారు. దీంతో వారి రాకపోకలకు సంబంధించిన మార్గాలు అత్యంత కీలకంగా మారాయి. ఆ మార్గాల్లో ఎక్కడైనా చిన్నపాటి భద్రతా లోపం కనిపించినా దాన్ని ఆసరాగా చేసుకుని నిరసనకారులు లేదా ఇతర వ్యక్తులు అంతరాయం కలిగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే వీవీఐపీ మార్గాల్లో నిఘాను పెంచడంతో పాటు అనుమా నాస్పద కదలికలపై వెంటనే సమాచారం అందేలా సమన్వయం




చేస్తున్నారు. భద్రతా వ్యవస్థ సిద్ధంసదస్సు జరిగే ప్రాంతాలతో పాటు విదేశీ ప్రతినిధులు బస చేసే అవకాశం ఉన్న హోటళ్లు, కీలక ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు, ఇవీవీఐపీ మార్గాల్లో నిఘాను పెంచడంతో పాటు తర ముఖ్యమైన ప్రాంతాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఎక్కడైనా అనుమానాస్పద కదలిక కనిపిస్తే వెంటనే స్పందించేలా భద్రతా వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. ఈసారి భద్రతా సంస్థలకు మరో ప్రధాన ఆందోళన డ్రోన్ల ముప్పు. సదస్సు ప్రాంతాల సమీపంలో అనధికా రికంగా డ్రోన్లు ఎగురవేసే ప్రయ త్నాలు జరిగే అవకాశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అందుకే డ్రోన్ కార్యకలాపాలపై నిఘాను పెంచారు. భద్రతా పరిమితుల్లోకి ఎలాంటి అనుమతి లేని పరికరాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో గ్రాఫిటీ ద్వారా నిరసన సందేశాలు రాసే ప్రయత్నాలపైనా నిఘా పెట్టారు. సదస్సుకు సంబంధించిన కీలక ప్రాంతాల్లో ఇలాంటి చర్యలు జరిగితే అంతర్జాతీయంగా కూడా దృష్టి పడే అవకాశం ఉండటంతో ముందుగానే వాటిని అడ్డుకోవాలని భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. చైనా, రష్యా అంశాలపైనా ఫోకస్బ్రిక్స్‌లో పాల్గొనే దేశాలకు సంబంధించిన సున్నితమైన అంశాలను కూడా భద్రతా సంస్థలు పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా చైనాకు సంబంధించిన టిబెట్ సమస్య, రష్యాకు సంబంధించిన కొన్ని సున్నితమైన అంశాలను నిరసనలకు ఉపయోగించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంబంధిత అంశాలపై గతంలో నిరసనలు చేసిన వర్గాల కదలికలను కూడా అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే నిర్దిష్టంగా ఏదైనా పెద్ద నిరసన జరగబోతోందనే విషయం కంటే సదస్సు సమయంలో సున్నితమైన అంశాలను ఆసరాగా చేసుకుని ఆకస్మికంగా ఆందోళనలు మొదలయ్యే అవకాశాన్ని భద్రతా సంస్థలు పరిగణనలోకి తీసుకున్నాయి. ఖలిస్థాన్‌కు సంబంధించిన ముప్పును కూడా భద్రతా అంచనాల్లో భాగంగా చేర్చారు. ఈ అంశానికి సంబంధించి అప్పుడప్పుడు ఈమెయిల్స్, ఇతర సమాచార రూపంలో హెచ్చరికలు వస్తుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. బ్రిక్స్ వంటి అత్యంత కీలక అంతర్జాతీయ సమావేశం సమయంలో ఎలాంటి జరిగినా అది పెద్ద సమస్యగా మారే అవకాశం ఉండజాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# ఇరాన్ యుద్ధం ముగిసినట్లేనా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్లాన్ ఏంటి

**ఇరాన్-అమెరికా:** యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు గడిచింది. ఇప్పటికే అప్పుడప్పుడూ దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రకటన చేసేందుకు ట్రంప్ కార్యాలయం సిద్ధమవుతున్నట్లు



సమాచారం. ఇదే సమయంలో హార్ముజ్ జలసంధితోపాటు, మిడిల్ ఈస్ట్‌లో సైన్యాన్ని మోహరించాలని కూడా అమెరికా భావిస్తోంది. యుద్ధాన్ని ముగిసినట్లు ప్రకటించడం, సైన్యాన్ని మోహరించడం వంటి అంశాలపై ట్రంప్ కార్యాలయం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంలో అధికారిక ప్రకటన ఏమీ వెలువడలేదు. మరోవైపు.. మిడిల్ ఈస్ట్‌లో భారీగా అమెరికా సైన్యాన్ని మోహరించాలని ఆ దేశ రక్షణ శాఖ సెక్రెటరీ పీట్ హెగ్సెత్ ఆదేశించారు. గత ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. చమురు సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో ట్రంప్ సర్కార్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలో అవసరమైతే ఇరాన్‌తో కుదుర్చుకోవాలని భావించిన అణు ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనికి బదులుగా హార్ముజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా తెరవాలని ట్రంప్ కోరనున్నటు తెలుస్తోంది. ఈ విషయంలో ఇంకా ట్రంప్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# కెన్యాలో హెలికాప్టర్ కూలి ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్‌తో సహా ఏడుగురు మృతి

**కెన్యా:** కెన్యాలోని సంబురు కౌంటీలో బుధవారం జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ మిచెల్ సెన్సి-కాంటుగి, ఆయన భార్య స్టెఫానీ హోలిహాన్ తో సహా ఒక అమెరికన్ మీడియా ఎగ్జిక్యూటివ్, నలుగురు ఇతర అమెరికన్లతో సహా మొత్తం ఏడుగురు మరణించారు. లోయిసాబాలోని ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి ఇవాసో నైరో నదికి హెలికాప్టర్ విహారయాత్రకు వెళుతుండగా ఉదయం 9:13 గంటలకు ఈ ప్రమాదం సంభవించిందని కెన్యా పౌర విమానయాన అథారిటీ ) తెలిపింది. హెలికాప్టర్ ప్రమాదంలో మిచెల్ సెన్సి-కాంటుగి మరణించినట్లు ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడు గిల్లెర్మో లాసో పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తరపున అధ్యక్షుడి కార్యాలయం నివాళులర్పించింది. అమెరికా మీడియా కథనం ప్రకారం ఈ ప్రమాదంలో మరణించిన అమెరికన్లలో మయామి రెస్టారెంట్ యజమాని రోజర్ డువార్టే కూడా ఉన్నారు. కాగా, కెన్యాలో హెలికాప్టర్ ప్రమాదాలు తరుచుగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. 2026 ఫిబ్రవరిలో రిఫ్ట్ వ్యాలీలోని నంది కౌంటీలో జరిగిన ఒక హెలికాప్టర్ ప్రమాదంలో పార్లమెంట్ సభ్యునితో సహా ఆరుగురు మరణించారు. అలాగే 2024లో దేశ పశ్చిమ ప్రాంతంలో 11 మందితో ప్రయాణిస్తున్న ఆర్మీ హెలికాప్టర్ కూలిపోవడంతో కేవలం ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. సైనిక అధిపతి జనరల్ ఫ్రాన్సిస్ ఒమోండి ఒగొల్లా మరణించారు. జూన్ 2021లో, రాజధాని నైరోబీ సమీపంలో ల్యాండింగ్ అవుతుండగా వారి హెలికాప్టర్ కూలిపోవడంతో కనీసం 10 మంది సైనికులు మరణించిన విషయం తెలిసిందే.

# నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే- ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్

**న్యూఢిల్లీ:** ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనంపై తుది నివేదిక సమర్పించేందుకు హైపవర్ కమిటీకి సుప్రీంకోర్టు డెడ్?లైన్ విధించింది. మరో ఆరు నెలల గడువు కావాలని కమిటీ కోరగా, అందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. నివేదిక సమర్పించేందుకు నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఇచ్చింది. ఈ లోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిరక్షణకు సంబంధించిన అంశంపై కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు నియమించిన హైపవర్ కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగేలా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ ఇటీవల కోర్టును కోరింది. అందులో భాగంగా తుది నివేదిక సమర్పించేందుకు మరో ఆరు




నెలల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆ వ్యవహారాన్ని సోమవారం విచారించింది. నవంబర్ 30లోగా తుది నివేదిక ఆరావళి అంశంపై నివేదికకు ఉన్న ప్రాధాన్యాన్ని కూడా స్పష్టం చేసింది. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. రెండు నెలల్లో నివేదిక సమర్పించలేకపోతే ప్రస్తుత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు

# సంపాదకీయం

## డోనాల్డ్ ట్రంప్ ఆపదమొక్కులు!



ఎన్నికల్లో గెలిచేందుకు మనదేశంలోని బూర్జువా పార్టీల ఆపదమొక్కులు, ఓటర్లకు ప్రలోభాల తీరుతెన్నుల గురించి చెప్పనవసరం లేదు. నరేంద్రమోడీ జిగినీదోస్తు డోనాల్డ్ ట్రంప్ కూడా అదే బాటలో పయనిస్తున్నాడా?అంటే అవుననే చెప్పాలి. నవంబరు మూడవ తేదీన పార్లమెంటు ఉభయ సభలకు మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఆ పోరులో అధికార రిపబ్లికన్ పార్టీ మెజారిటీ కోల్పోనున్నట్లు పండితులు చెబుతున్నారు. తాజాగా ఫైనాన్సియల్ టైమ్స్ సర్వేలో ఎన్నికలలో కేవలం 32శాతం మందే డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ఇస్తున్నట్లు తేలింది. చివరికి అధికార రిపబ్లికన్ పార్టీ మద్దతు కూడా తగ్గుతూ 72శాతానికి పడిపోయినట్లు కూడా వెల్లడైంది. మరొక సర్వే ప్రకారం అధ్యక్షుడిగా పనితీరును కేవలం 34శాతం మంది రిపబ్లికన్లు మాత్రమే సమర్ధించినట్లు ఎన్‌బిసి న్యూస్ సర్వే వెల్లడించింది. అటూ ఇటూ ఎటు తిప్పి అడిగినప్పటికీ ఓటర్లలో మద్దతు తగ్గుతూనే ఉన్నట్లు వెల్లడౌతోంది. దీంతో దిక్కుతోచని ట్రంప్ ఆగస్టు 30 నుంచి మరోసారి ఇరాన్ మీద దాడులు ప్రారంభించాడు. దాంతో అనివార్యంగా ఇరాన్ కూడా ప్రతిదాడులు చేస్తు న్నది. అమెరికా ఐదు ఇరాన్ చమురు టాంకర్ల మీద క్షిపణిదాడి చేస్తే టెహరాన్ కూడా అమెరికా అనుకూల టాంకర్ల మీదనే కాదు, జోర్డాన్‌లోని దాని సైనిక స్థావరాల మీద దాడి చేసి అనేక యుద్ధ విమానాలను నష్టపరి చిందని, నౌకల మీద క్షిపణులను వదలటమే కాదు, ఒక మానవరహిత అమెరికా జలాంతర్గామిని కూడా హోర్ముజ్ జలసంధిలో పట్టుకున్నట్లు ప్రకటించింది. చిత్రం ఏమిటంటే అది అంతకు ఒకరోజు ముందునుంచే పనిచేయటం లేదని అమెరికా ప్రకటించింది. ఒకవేళ అదే నిజమనుకున్నా దాని ఆయుధాల సామర్ధ్యం ఎంతగా నాసిగా ఉందో అర్ధం చేసుకోవచ్చు.నవంబరు మూడున ఎన్నికల్లో తమ అభ్యర్ధులను గెలిపించి ఉభయ సభల్లో మెజారిటీ వచ్చేట్లు ఓటు వేస్తే ప్రతి ఓటరుకు ఐదువేల డాలర్ల(దాదాపు ఐదు లక్షల రూపాయలు) ట్రంప్ డివిడెండ్ పేరుతో అందచేస్తానని డలాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ తొలి ఎన్నికల సభలో ప్రకటించటం ట్రంప్ దిగజారు డుతనంతో పాటు అధికార పార్టీ దుస్థితిని వెల్లడిస్తోంది. అది జరుగు తుందో లేదో తెలియదు గానీ ఒకవేళ ఇస్తే గిస్తే 27 కోట్ల మందికి 1.35లక్షల కోట్ల డాలర్లు ఎక్కడి నుంచి తెస్తాడన్నది సమస్య. తాము గెలిస్తే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో 15లక్షల రూపాయలు వేయవచ్చని బీజేపీ ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇదేమిట య్యా అంటే జుమ్లా అని అమిత్ షా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఎన్నికల కోసం అనేక కబుర్లు చెబుతాం అన్నీ అమలు చేస్తామా అన్నది షా మాటలకు అర్ధం. ట్రంప్ రెండు రోజుల డలాస్ సభలో తొలిరోజు హాలు కొంతభాగం ఖాళీగా ఉన్నట్లు వార్తలొ చ్చాయి. ఇక యథా ప్రకారం ప్రతిపక్ష డెమోక్రాట్లను సోషలిస్టులు, కమ్యూనిస్టులంటూ వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు ఈ వేదికను కూడా వినియోగించుకున్నారు. గతంలో ఇలాంటి ప్రచారాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ కేంద్రమైన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు తిరస్కరించిన సంగతి తెలిసిందే. నోరు తెరిస్తే పచ్చి అవాస్తవాలు, అబద్దాలు చెబుతున్న ట్రంప్ మాటలను విశ్వసించి ఓటర్లు ఐదువేల డాలర్ల ఎరకు లొంగుతారా? కార్మికవర్గం ఏమైనా గానీ తమ, ఆశ్రితులకు ఎంత ప్రయోజనం కలిగిందే లెక్క.ట్రంప్ తీరు కూడా అలాగే ఉంది, ఇరాన్‌పై దాడులతో జనాల మీద విపరీతమైన భారాలు మోపుతున్నాడు. ఇతర విధానాలతో తన రెండేండ్ల పాలనలో పరువు దిగజారినప్పటికీ తన వ్యాపా రాల ద్వారా ట్రంప్ గణనీయంగా సంపాదించినట్లు తేలింది. ఒక్క 2025లోనే అతగాడి సంపద 220 కోట్ల డాలర్లు పెరిగింది. ఇంకా ఎంతకాలం ఇరాన్ మీద దాడులు, మా జీవితాలను అతలాకుతలం కావిస్తారంటూ రిపబ్లికన్ పార్టీలోని సామాన్యులు కూడా ప్రశ్నిస్తున్నారు. దానికి స్పందనగానే ఎన్నికలు ముగియగానే దాడులు ఆగిపోతాయని ట్రంప్ ప్రకటించాల్సి వచ్చింది. ప్రతి రెండు నిమిషాలకు పదిలక్షల డాలర్ల మేర గృహస్తులపై అదనంగా ఇంధన భారం పడుతున్నట్లు బ్రౌన్ విశ్వవిద్యాలయం అంచనా వేసింది. బహుశా ఇలాంటి అన్ని రకాల భారాలు మోస్తున్నవారిని ఆకర్షిం చేందుకు ఐదువేల డాలర్ల ఎరవేసినట్లుగా కూడా చెప్పవచ్చు. మరోవైపున తాను విజయం సాధించానని, టెహరాన్‌ను చావుదెబ్బ తీశానని గొప్పలు చెప్పుకొనేందుకు మరోసారి దాడులకు దిగాడు. అమెరికా ఎంతకు తెగించినప్పటికీ ప్రతిఘటన విషయంలో ఇరాన్ వెనక్కు తగ్గటం లేదు. కంటికి కన్ను పంటికి పన్ను అన్నట్లుగా దెబ్బకు దెబ్బతీస్తున్నది. మధ్యంతర ఎన్నికలు అవగానే దాడులు ముగుస్తాయని చెబుతున్నప్పటికీ మరోవైపున ట్రంప్ పదవీకాలం పూర్తయ్యే 2029వరకు కొనసాగుతాయనే విశ్లేషణలు వెలువడ్డాయి. ఆయుధ వ్యాపారులకు లాభాలు సంపాదించి పెట్టే ట్రంప్ వంటి దుర్మార్గులు ఉన్నంతవరకు, వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇచ్చేవారు ఉన్నంత కాలం ఇలాంటి దురాగతాలు కొనసాగుతూనే ఉంటాయి !

## ఎవరి కోసం ఈ బ్యాంకింగ్ సంస్కరణలు?




మన దేశ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుమార్పులు జరగబోతున్న సంకేతాలు, ప్రకటనలు అనేకం చూస్తున్నాం. ప్రభుత్వ బ్యాంకుల సేవల మీద ఆధారపడ్డ విస్తృత ప్రజానీకం, మధ్యతరగతి మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు, చిన్న--మధ్యతరహా పరిశ్రమల అధిపతులు మారుతున్న పరిస్థితులను అర్ధం చేసుకోవాలి, స్పందించాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు ప్రజలది. బ్యాంకుల మూలధనం (కాపిటల్) ప్రజలు కట్టిన పన్నుల ఆదాయం నుంచి సమకూర్చినది. లక్షల కోట్ల రూపాయల లాభాలు ఉద్యోగుల శ్రమశక్తితో సంపాదించినవి. భారత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న 'వికసిత్ భారత్--2047' సాధనలో బ్యాంకుల పాత్ర ఎలా ఉండాలో అధ్యయనం చేయడం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026--27 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. తదనుగుణంగా, ఆగస్టు 17, 18 తేదీల్లో ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రభుత్వరంగ బ్యాంకుల శిఖరాగ్ర సమావేశం ఆ ఉన్నతస్థాయి కమిటీకి నివేదించాల్సిన ప్రతిపాదనల మీద చర్చించింది. దీనికితోడు ప్రధానమంత్రి తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రపంచస్థాయి ఐదు పెద్ద బ్యాంకులలో కనీసం ఒక భారతీయ బ్యాంకు ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులకు సంకేతం. అద్భుతమైన ఈ నినాదాల వెనుక దాగి ఉన్న నిజాలేమిటి?ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు (డిపాజిట్లు)లో 60శాతం పైగా సొమ్ము సామాన్యులు, ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్లకోసం దాచుకున్నదే. ఈ కష్టార్జితాన్ని సేవింగ్స్ ఖాతాలో పెట్టుకుంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ 2.5 శాతం నుంచి 2.7శాతం. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే 6.5శాతం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం 6శాతానికి చేరువలో ఉంది. అంటే ప్రతి ఏటా సామాన్యుడు దాచుకున్న పొదుపు విలువ తగ్గుతోంది తప్ప, రూపాయి విలువకు రక్షణ లేదు.

# అడవి బిడ్డల ఆక్రందన



'జల్-జంగిల్-జమీన్' ఒక నినాదం కాదు... ఆదివాసీల మనుగడకు మూలాధారం. అడవుల్లో ఉన్న అత్యంత విలువైన ఖనిజాలను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు గిరిజనుల హక్కులను కాలరాసే చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటుండటం దుర్మార్గం. నేటికీ ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని ప్రాంతాల్లో దుర్భర జీవితాన్ని గడుపుతూ, నిత్యం దోపిడీకి గురవుతూ, వ్యాధులు, ఇతర కారణాలతో ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీల రక్షణ ప్రభుత్వాల బాధ్యత. 'భూమి, అడవులు మావే... అదానీ, అంబానీలవి కావు' అంటూ ఢిల్లీ వేదికగా నినదించిన మన్యం బిడ్డల గోడును పట్టించుకోకపోతే వారి మనుగడకే కాదు... ప్రకృతి, సమస్త మానవాళి మనుగడకూ వినాశనమే. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ ఎం) ఆధ్వర్యాన హస్తినలోసాగిన ఆదివాసీల భారీ ధర్నా, ప్రదర్శన, జాతీయ సదస్సు లేవనెత్తిన డిమాండ్లు ఎంతో సహేతుక మైనవి. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో పొందుపరిచిన హక్కులు, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ), పంచాయతీలకు విస్తరించిన షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టం (పీసా), 1/70 తదితర చట్టాలు అమలులో ఉన్నప్పటికీ ఆదివాసీలకు భూమి, అడవులు, సహజ వనరులపై హక్కులు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. లోకూర్ వ్యాఖ్యలు అక్షర సత్యం.ఆ చట్టాలను నిర్వీర్యం చేసే దుర్మార్గపు ప్రతిపాదనలను కేంద్రంలోని మోడీ సర్కారు ముందుకు తీసుకురావడం మరింత ఆందోళనకరం. గ్రామ సభల అధికారాలను పక్కనపెట్టి ఖనిజ వనరుల పేరుతో ఆదివాసీలను తరిమివేయడం, మణిపూర్‌లాంటి ప్రాంతాల్లో జాతి హింస పెచ్చరిల్లేలా కుట్రలు పన్నడం వారి హక్కులను హరించడమే. తెలంగాణలోనూ పోడు భూముల విషయంలో గిరిజనుల హక్కులను నిర్లక్ష్యం చేస్తూ అటవీశాఖ చర్యలు చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో అటవీ సిబ్బంది, గిరిజనుల మధ్య ఘర్షణలు తీవ్ర చర్చకు దారితీశాయి. రెండునెల్ల క్రితం అశ్వాపురం మండలం మనుబోత్లగూడెం వద్ద ఒక గిరిజన మహిళపై అటవీ సిబ్బంది దాడి చేయడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. భూమి, అడవి తమ జీవనాధారమని గిరిజన కుటుంబాలు చెబుతుండగా, మరోవైపు అటవీ సంరక్షణ పేరుతో చర్యలు కొనసాగుతున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ రంగం విస్తరించడంతో వారి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ కుంచించుకు పోతు న్నాయి. అలాగే భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన నర్సు హైదరాబాద్‌లోని తుక్కు గూడలో హత్యకు గురైన ఘటన ఆదివాసీ మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ప్రజలకు సేవలందించే బాధ్యతలో ఉన్న ఒక ఆదివాసీ బిడ్డ ప్రాణాలు కోల్పోవడం పాలనాతీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తు తోంది. గిరిజన మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు, ఈ హత్యకు బాధ్యులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ మలేరియా, ఇతర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సదుపాయాలు, రహదారులు లేకపోవడంతో సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయి. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత. అలాగే గిరిజన ప్రాంతాల్లో పోడు భూముల సమస్యను పరిష్కరించకుండా, అడవుల సంరక్షణ పేరుతో సాగుదారులపై కేసులు పెట్టడం, సాగును అడ్డుకోవడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. అటవీ హక్కుల చట్టం కింద అర్హత ఉన్న ప్రతి గిరిజన కుటుంబానికి హక్కులు కల్పించడంతోపాటు, ఇప్పటికే పట్టాలు పొందిన వారి భూములపై స్పష్టమైన సర్వే, సరిహద్దుల నిర్ణయం చేపట్టాలి. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూ వివాదాలకు రైతులను బలిపశు వులను చేయకూడదు.గిరిజనాన్ని చెట్టుకొకరు పుట్టకొకరుగా తరిమేసే ప్రమాదకరమైన ది మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ బిల్లు 2026ను కేంద్రం ఉపసంహరించుకోవాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఆదివాసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లను పెంచడం ప్రభుత్వాల బాధ్యత. పోడు భూముల సమస్యకు ఇక తాత్కాలిక పరిష్కారాలు కాదు... శాశ్వత పరిష్కారం కావాలి. గిరిజన రైతుకు పట్టా ఇచ్చి మళ్లీ అదే భూమిలో సాగు చేసుకోవడానికి అడ్డంకులు సృష్టించడం సరికాదు. గ్రామసభల నిర్ణయాలను గౌరవించి, ఎఫ్ఆర్ఎ, పీసా, ఐదో షెడ్యూల్ హక్కులను సమర్ధంగా అమలు చేయాలి. గిరిజనుల జీవనాధారాన్ని కాపాడుతూనే అడవులను సంరక్షించే సమగ్ర విధానాన్ని ప్రభుత్వం రూపొందించాలి. ఆదివాసీ బిడ్డల ఆవేదన అరణ్య రోదనగా మారితే నష్టపోయేది సమాజమే. వారి భూమి, అడవి, జీవనాధారాలను కాపాడటం అంటే ప్రకృతిని, భవిష్యత్ తరాల మనుగడను కాపాడటమే. 'జల్-జంగిల్-జమీన్'పై ఆదివాసీల హక్కులను గౌరవించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. అరణ్య రోదనను ఆలకించి, అడవి బిడ్డల హక్కులను కాపాడాల్సిన సమయం ఇదే.

# మొదలైనచోటే ముగిసిన వివాదం!




హైదరాబాద్ నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల వివాదం సుప్రీంకోర్టులో మొదలై అక్కడే ముగిసింది. లా విద్యార్థుల మీద, టీచింగ్ సిబ్బంది మీద క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు లేదని సుప్రీంకోర్టు సెప్టెంబరు 3న తీర్పు చెప్పింది. సెప్టెంబరులో జరగాల్సిన నల్సార్ లా యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించారు. ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా పట్టాలు తీసుకోవడం న్యాయశాస్త్ర విద్యార్థులకు గొప్ప అవకాశం. కానీ నల్సార్ విద్యార్థులు దానికి అభ్యంతరం చెప్పారు. జస్టిస్ సూర్యకాంత్‌కు రాజ్యాంగ ప్రధాన విలువల మీద గౌరవం లేదనీ, అలాంటివారి చేతుల మీదుగా తాము పట్టాలు తీసుకోబోమనీ అన్నారు. దీంతో యూనివర్సిటీ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించే ఆలోచనను విరమించుకుంది. కానీ, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలు తెలపడం పట్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) తీవ్రంగా స్పందించింది. ఈ ఏడాది నల్సార్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రులైన వారిని దేశంలో ఏ బార్ అసోసియేషన్?లోనూ నమోదు చేసుకోరాదని బీసీఐ అధ్యక్షులు మానన్ కుమార్ మిశ్రా తీవ్రమైన ఉత్తర్వు జారీచేశారు. మానన్‌కుమార్ మిశ్రా బీజేపీకి సన్నిహితులు. బీసీఐ అధ్యక్ష పదవిలో పదేళ్లుగా నిరాఘాటంగా కొనసాగుతున్న వారు. రెండేళ్ల క్రితం బిహార్ నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు. జస్టిస్ సూర్యకాంత్ పరువును కాపాడే లక్ష్యంతో మానన్‌కుమార్ మిశ్రా ఈ వినూత్న ఉత్తర్వులు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ ఉత్తర్వులు రాగానే, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్‌తో సహా, దేశంలోని ప్రజాస్వామికవాదులంతా మానన్‌కుమార్ మిశ్రా నిర్ణయం మీద తీవ్రంగా స్పందించారు. నిరసనలు పెరగటంతో బీసీఐ తన ఉత్తర్వుల్ని ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ఆ వివాదం ముగియకుండా మరికొన్ని ఆసక్తికర మలుపులు తిరిగింది. నల్సార్ యూనివర్సిటీ పూర్వవిద్యార్థులు మిహిరా సూద్, అభిషేక్ తివారీ బీసీఐ తీరుపైన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అడ్వకేట్ పరమేశ్వర్ విద్యార్థుల కేసును వాదించారు. ఈ కేసు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనానికే వెళ్లింది. ఇక్కడే ఈ కేసు కొత్త మలుపు తిరిగింది.ఇది నల్సార్ యూనివర్సిటీ కేసు అని చాలా మంది అనుకుంటున్నారు. కానీ, ఈ కేసు అసలు సుప్రీంకోర్టులోనే ఆరంభం అయ్యి, తిరిగి సుప్రీంకోర్టుకే వచ్చింది. ఈ ఏడాది మేలో ఒక కేసు విషయమై సుప్రీంకోర్టుకు వచ్చిన సమాచార హక్కు కార్యకర్తలను సీజేఐ 'బొద్దింక'లంటూ కసురుకున్నారు. ఆ విసుర్లనే ఆత్మగౌరవంగా భావించి, బొద్దింకల ఉద్యమం మొదలయ్యింది. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా, కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుతో, యువతరం ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసనలు చేపట్టింది. నిరసనకారుల మీద లాఠీలతో విరుచుకుపడితే ఈ ఉద్యమం ఆగిపోతుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. విద్యార్థుల మీద తీవ్రంగా లాఠీచార్జి జరిగింది. కానీ, లాఠీ కర్రకు మేకులు దించి కొట్టారు! సంప్రదాయ నిర్వచనం ప్రకారం అది లాఠీచార్జి కాదు; మేకులు దించడం. ఆపైన తుపాకుల్లో పెల్లెట్లు పెట్టి కాల్పులు జరిపారు.నిజానికి ఇలాంటి దురంతాలు జరిగినప్పుడు భారత ఉన్నత న్యాయస్థానం సుమోటోగా స్పందించవచ్చు. అలా జరగలేదు. పైగా, పోలీసుల వ్యవహార శైలి మీద స్పందించాలని కొందరు అడ్వకేట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించి లాఠీచార్జికి సంబంధించిన వీడియోలను పరిశీలించమన్నప్పుడు సీజేఐ అసహనాన్ని వ్యక్తం చేశారు. తన సమయాన్ని వృథా చేయవద్దని మందలించారు. ఈ వార్త వైరల్ అయ్యింది. జెన్‌జీకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి దానికి ముందున్న తరాలు జెన్ వై, జెన్ ఎక్స్ కూడా నిరసనలకు మద్దతుగా వచ్చాయి. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పలేదు. 'ఉన్నత న్యాయమూర్తులకు పదవీ విరమణానంతరం నామినేటెడ్ పదవులు ఇవ్వరాదు' అన్న డిమాండును బొద్దింకల ఉద్యమం ముందుకు తెచ్చింది. ఎవరిని ఉద్దేశించి ఈ డిమాండు పుట్టిందో తెలియనివారుండరు. ఇన్ని మెలికలు తిరిగిన నల్సార్ కేసు చివరకు అదే సీజేఐ ధర్మాసనానికే వచ్చింది. గతంలో రెండుసార్లు జరిగిన పొరపాట్లను జస్టిస్ సూర్యకాంత్ ఈసారి చేయదలచుకోలేదు. విద్యార్థులకూ తనకూ మధ్య జరుగుతున్న వ్యవహారంలో తలదూర్చడానికి బీసీఐ ఎవరు? అని గట్టిగా అడిగారు. మానన్‌కుమార్ మిశ్రాకు పెద్ద షాకిచ్చారు. అంతేకాదు, నిరసన వ్యక్తం చేసే ప్రజాస్వామిక హక్కు విద్యార్థులకు ఉందని గట్టిగా సమర్థించారు. తాను కూడా కాలేజీ రోజుల్లో నిరసనల్లో పాల్గొనేవాడినని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అంతిమ తీర్పులో-- అడ్వకేట్లు కాకముందు విద్యార్థుల వ్యవహారాల్లో తలదూర్చే అధికారం బీసీఐకు లేదని తీర్పు ప్రకటించారు.మానన్‌కుమార్ మిశ్రాకే కాదు; బొద్దింకల నిరసనోద్యమం విషయంలో ఢిల్లీ పెద్దల మెప్పు కోసం దిగజారుడు పనులు చేసిన వారందరికీ నల్సార్ లా విద్యార్థుల నిరసన కేసుపై వచ్చిన ఈ తీర్పు ఒక చెంపపెట్టు లాంటిది!

## పిల్లల స్నేహం 'టాక్సిక్' బంధంగా మారుతోందా? - పేరెంట్స్ ఈ పనులు చేయాలంట



టీనేజ్ ఓ అందమైన రంగుల ప్రపంచం. ఈ వయసులో హార్మోన్ల హెచ్చుతగ్గులే కాదు, భావోద్వేగాలూ తికమక పెడుతుంటాయి. ఇలాంటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, స్నేహం ముసుగులో వాళ్లు 'టాక్సిక్' బంధాల్లో చిక్కుకునే ప్రమాదమూ ఉందంటున్నారు నిపుణులు. దీన్ని పిల్లలు గుర్తించేలా చేయడమే పేరెంట్స్ బాధ్యతని చెబుతున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఎవరీ ఫ్రెండ్ : పేరెంట్స్?గా ముందు మీరు టాక్సిక్? ఫ్రెండ్?షిప్ అంటే ఏంటో అర్థం చేసుకోవాలంటున్నారు నిపుణులు. చిన్నప్పుడైతే బొమ్మలూ, చాక్లెట్లే గొడవలకు కారణాలని చెబుతున్నారు. టీనేజ్?కి వచ్చే సరికి ఈక్వేషన్స్? మారిపోతాయని పేర్కొంటున్నారు. చాలామంది పిల్లలకు ఈ వయసులో స్నేహితులే లోకంగా మారుతుంటారని తెలియజేస్తున్నారు. కష్టసుఖాల్లో తోడుంటూ, సరదాగా గడుపుతుంటారు. కానీ, అందుకు భిన్నంగా, తన స్నేహితురాలిని ఎప్పుడూ నలుగురిలోనూ కించపరచాలని చూస్తుంటారు. ప్రైవసీని పబ్లిక్ చేయడం, చిన్నచిన్న విషయాలకే నిలదీయడం, నియంత్రించడం, మాట వినకపోతే బ్లాక్?మెయిల్ చేయడం.. వంటివి చేస్తుంటే మాత్రం తనని టాక్సిక్ ఫ్రెండ్? అని గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే అమ్మాయి హఠాత్తుగా ఎవరితోనూ మాట్లాడకుండా గదిలో తలుపు వేసుకుని కూర్చున్నా, రాత్రిపూట ఫోన్ చూస్తూ ఏడుస్తున్నా.. 'నాకెవరూ స్నేహితులు లేరు, నేనంటే ఎవరికీ ఇష్టం లేదు' అని తరచూ చెబుతున్నా సందేహించాలంటున్నారు. అంతేకాదు, ముఖ్యంగా బెస్ట్? ఫ్రెండ్? అనే సాకుతో.. మన పిల్లలు ఎప్పుడూ అవతలి వ్యక్తి అనుమతి కోసమో, పొగడ్త కోసమో వెంపర్లాడుతుంటే అది ఆరోగ్యకరమైన స్నేహం కాదని గుర్తించాలని పేర్కొంటున్నారు. ఎందుకంటే, ఈ రకం స్నేహాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని చంపేస్తాయని వివరిస్తున్నారు. దంపతుల మధ్య బంధం బలపడాలంటే – ఆ 'భరోసా' ఇస్తే చాలంటున్న నిపుణులు!

ఎందుకిలా : పిల్లలు టాక్సిక్ స్నేహాల బారిన పడటానికి కారణాలు చాలానే ఉంటాయి. ముఖ్యంగా, నేటి జీవనశైలి వల్ల తల్లిదండ్రులు పిల్లలతో గడపడానికి సమయం లేకపోవడం, మరోవైపు పిల్లల్లో ఒంటరితనం పెరిగిపోవడంతో వారు తోడు కోసం స్నేహాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అవి చెడు స్నేహాలని తెలిసినప్పటికీ, ఆ బంధాలను వదులుకోలేక అలాగే కొనసాగిస్తున్నారు.

ఏం చేయాలి? : టీనేజ్ పిల్లల దగ్గరికి వెళ్లి 'నీ ఫ్రెండ్ చెడ్డది, ఆమెతో తిరగకు' అంటే తిరిగి మన మీదనే అరిచేస్తారు. అందుకే వారితో కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాలి. వాళ్లని జడ్జ్? చేయకుండా, వాళ్లేం చెబుతున్నారో వినాలంటున్నారు నిపుణులు. ఇవాళ స్కూల్లో విశేషాలేంటి? ఇవాళ డల్?గా ఉన్నావు, ఏమైంది? అంటూ వారిని కబుర్లలోకి దించాలట. పిల్లలు వాళ్లంతట వాళ్లే సమస్యను బయటపెట్టే స్పేస్ ఇవ్వాలని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని సార్లు పిల్లలు తమ తప్పును ఒప్పుకోవడానికి మొండికేస్తారని తెలియజేస్తున్నారు. అలాంటప్పుడు అనవసరమైన క్లాసులు పీకకుండా, మీ చిన్ననాటి అనుభవాలు పంచుకోవాలని పేర్కొంటున్నారు. 'మా కాలేజీలో ఒకరు, నన్ను ప్రతిదానికీ ఇమిటేట్ చేసేవారు, చిరాగ్గా అనిపించేది' అంటూ మన అనుభవాలను జోడిస్తే వాళ్లు ఇట్టే కనెక్ట్ అవుతారని తెలియజేస్తున్నారు. ఎదుటివాళ్ల ప్రవర్తన వల్ల కలిగే మానసిక ఇబ్బందిని గ్రహించగలుగుతారని వివరిస్తున్నారు. అప్పుడు అసలు మీ స్నేహితులు అలా అంటే నీకేమనిపించింది? నిన్ను నువ్వు తక్కువ చేసుకుంటున్నావా? అని ఆలోచింపజేయాలని వివరిస్తున్నారు. అప్పుడే ఆత్మన్యూనత నుంచి బయటపడతారని తెలియజేస్తున్నారు.

## యువతలో వృద్ధాప్య ఛాయలు - ఇలా సెట్? చేసుకోవాలని నిపుణుల సూచన!



నేటి యువత ఎక్కువగా అలసట, మానసిక ఒత్తిడి, చర్మ సమస్యలు, తక్కువ శక్తి స్థాయిలతో ఇబ్బంది పడుతున్నారు. ఇవి కేవలం సాధారణ ఆరోగ్య సమస్యలు మాత్రమే కావు. ఇవి అకాల వృద్ధాప్యానికి ముందస్తు సంకేతాలు కావచ్చు. ఒకప్పుడు 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత మాత్రమే కనిపించే వృద్ధాప్య లక్షణాలు, నేటి మారుతున్న జీవనశైలి కారణంగా యువతలోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందుకు దీర్ఘకాలిక ఒత్తిడి, స్క్రీన్ సమయం పెరగడమే ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. అందువల్ల, వృద్ధాప్య సంకేతాలను నెమ్మదింపజేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఒత్తిడి : నిరంతర మానసిక ఒత్తిడి శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ స్థాయిలను విపరీతంగా పెంచుతుంది. ఈ హార్మోన్ హెచ్చుతగ్గుల వల్ల శరీరంలో అంతర్గతంగా అనేక నష్టాలు జరుగుతాయి. ఇది కణాల మరమ్మత్తు ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. చర్మం స్థితిస్థాపకతను తగ్గించి ముడతలు పడేలా చేస్తుంది. తీవ్రమైన జుట్టు రాలడానికి కారణమవుతుంది. అంతేకాకుండా, ఒత్తిడి నిద్రలేమికి దారితీస్తుంది. దీనివల్ల శరీరం రాత్రి వేళల్లో చేసుకునే సెల్ఫ్ రిపేర్ ప్రక్రియ పూర్తిగా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు.

స్క్రీన్స్ : మొబైల్? ఫోన్లు, లాప్?టాప్?లు, టాబ్లెట్?ల నుంచి వెలువడే బ్లూ లైట్ చర్మం లోపలి పొరల్లోకి చాలా సులభంగా చొచ్చుకుపోతుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా ఉండే కొల్లాజెన్, ఎలాస్టిన్ అనే ప్రోటీన్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఫలితంగా, చర్మంపై ముడతలు, మచ్చలు లేదా పిగ్మెంటేషన్ వేగంగా పెరగుతాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, రాత్రివేళల్లో స్క్రీన్?లను ఎక్కువగా చూడటం వల్ల నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి క్షీణిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది నిద్రలేమికి దారితీసి, వృద్ధాప్య ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుందంటున్నారు. అంతేకాదు, గంటల తరబడి స్క్రీన్లను చూడటం వల్ల కళ్లపై ఒత్తిడి పడి డార్క్ సర్కిల్, సన్నని గీతలు ఏర్పడతాయని పేర్కొంటున్నారు.పిల్లల స్నేహం 'టాక్సిక్' బంధంగా మారుతోందా? – పేరెంట్స్? ఈ పనులు చేయాలంట!రెండింటి కలయిక : మానసిక ఒత్తిడి, మితిమీరిన స్క్రీన్ సమయం, ఈ రెండూ తోడైనప్పుడు అకాల వృద్ధాప్య ముప్పు అనేక రెట్లు పెరుగుతుంది. నేటి యువత ఒక ప్రమాదకరమైన జీవనశైలి చక్రంలో చిక్కుకుపోయారు.

ఆఫీసులో ఉద్యోగ ఒత్తిడి మధ్య కంప్యూటర్? స్క్రీన్ల ముందు గంటల తరబడి పనిచేయడం, ఆ తర్వాత ఇంటికి వచ్చాక కూడా విశ్రాంతి లేకుండా మొబైల్స్?లో సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్?ఫారమ్?లపై గడపడం అలవాటుగా మారిపోయింది. దీనివల్ల శరీరానికి కనీస విశ్రాంతి కూడా దొరకడం లేదు. ఫలితంగా, శరీరం, చర్మం అనేవి సహజంగా మరమ్మత్తు చేసుకునే అవకాశాన్ని పూర్తిగా కోల్పోతాయి.నివారణ కోసం ఏమి చేయాలి? :డిజిటల్ డిటాక్స్ : ప్రతిరోజూ కొన్ని గంటల పాటు స్క్రీన్?లకు దూరంగా ఉండాలి. అలాగే, బ్లూ లైట్ ఫిల్టర్? గ్లాసెస్ ఉపయోగించాలి.ఒత్తిడి నిర్వహణ : ప్రతిరోజూ ధ్యానం, యోగా, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.మంచి నిద్ర అలవాట్లు : పడుకోవడానికి ఒక గంట ముందే స్క్రీన్?లకు దూరంగా ఉండాలి. అలాగే, 7 –8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.పోషకాహారం : ఆకుకూరలు, బెర్రీలు, నట్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే, ప్రతిరోజూ పుష్కలంగా నీరు తాగాలి.చర్మ సంరక్షణ : క్రమం తప్పకుండా సన్?స్క్రీన్ ఉపయోగించాలి.చీూజు : ఇక్కడ మీకు

## అధికమాసం వల్ల తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు- సాలకట్ల, నవరాత్రి ఉత్సవాల మధ్య తేడాలు ఇవే



: ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తిరుమల శ్రీవారి ఆలయంలో అధిక మాసం సందర్భంగా రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాలు సాధా రణంగా భాద్రపద మాసంలో జరుగు తాయి. అసలైన బ్రహ్మోత్సవాలు ఆశ్వయుజ మాసం ఓలో నవరాత్రులలో జరుగుతాయి. ఈ సందర్భంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మధ్య గల ముఖ్యమైన తేడాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.సాలకట్ల బ్రహ్మోత్సవాలు

భాద్రపద మాసంలో జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలు మొదటి రోజు ధ్వజారోహణంతో ప్రారంభమై, చివరి రోజు ధ్వజావరోహణంతో శాస్త్రోక్తంగా ముగుస్తాయి.

నవరాత్రి బ్రహ్మోత్సవాలునవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆశ్వయుజ మాసంలో నవరాత్రుల సమయంలో నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి తంతువులు ఉండవు. అలాగే సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఉపయోగించే పెద్ద కట్టె రథం అంటే రథోత్సవం బదులుగా, నవరాత్రి బ్రహ్మోత్సవాలలో స్వామి వారు బంగారు రథంపై భక్తులకు దర్శనమిస్తారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఎప్పటి నుంచి?

2026 సంవత్సరంలో అధిక మాసం రావడంతో, సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మళ్లీ అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు ఈ రెండు ఉత్సవాల్లోనూ మలయప్ప స్వామి వారి వివిధ వాహన సేవలను దర్శించుకుని తరించవచ్చు. ఈ బ్రహ్మోత్సవాల వివరాలు ఇప్పుడు చూద్దాం.అధికమాసం కారణంగా కనులవిందుగా రెండు బ్రహ్మోత్సవాలు

ఈ ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలు రెండుసార్లు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏ రోజు ఏ వాహనసేవలు జరగనున్నాయి చూద్దాం. సెప్టెబరు 08, మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది.

సెప్టెంబర్ 14, సోమవారం రోజు రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది.సెప్టెంబర్ 15, మంగళవారం సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల వరకు ధ్వజారోహణం కార్యక్రమం జరుగుతుంది.ద ేవతలకు ఆహ్వానంతిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణం తో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చక స్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు.ఏ రోజు ఏ వాహనసేవ? ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఈ విధంగా ఉంటుంది.సెప్టెంబర్ 15, మంగళవారం రాత్రి 9 గంటలకు పెద్దశేషవాహనం జరుగుతుంది.సెప్టెంబర్ 16, బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీవారు చిన్న శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీవారు హంస వాహనంపై తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 17, గురువారం ఉదయం 8 గంటలకు శ్రీవారు సింహవాహనంపై ఊరేగుతారు. అదే రోజు రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనంపై తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 18, శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీవారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతారు. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీవారు సర్వభూపాల వాహనంపై తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిసా ్తరు.సెప్టెంబర్ 19, శనివారం ఉదయం 8 గంటలకు శ్రీవారు మోహినీ అవతారంలో దర్శనమిస్తారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టమైన గరుడ వాహనంపై శ్రీవారు తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 20, ఆదివారం ఉదయం 8 గంటలకు హనుమంత వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజు సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు గజ వాహనంపై శ్రీవారు తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 21, సోమవారం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనంపై తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 22, మంగళవారం ఉదయం 7.30 గంటలకు శ్రీవారి రథోత్సవం కనుల పండుగగా జరగనుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీవారు అశ్వవాహనంపై తిరు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.సెప్టెంబర్ 23, బుధవారం రోజు శ్రవణా నక్షత్రం సందర్భంగా పవిత్ర పుష్కరిణిలో చక్రస్నానం ఘనంగా జరుగుతుంది. అదే రోజు రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం తరువాత ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ధ్వజావరోహణం ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిఈ బ్రహ్మోత్సవాలలో తనను దర్శించిన వారిని ఆ శ్రీనివాసుడు అనుగ్రహించి ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రసాదిస్తాడు. ఈ ఉత్సవాల సందర్భంగా భగవంతుని సేవలో, భక్తుల సేవలో తరించేవారి అభీష్టాలను ఆ శ్రీనివాసుడు త్వరితంగా తీరుస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ

## అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శివలింగం- ప్రొద్దుటూరులో అరుదైన నవగ్రహ మండపం విశేషాలివే!





పరమేశ్వరుడు వెలసిన ఆలయాలలో ఎక్కువ భాగం అతి ప్రాచీన చరిత్ర కలిగినవే అయి ఉండడం విశేషం. వాస్తవానికి ఈశ్వరుడు వెలసిన ప్రతి క్షేత్రానికి ఓ కథ ఉంటుంది. కొన్ని శివాలయాలు విభిన్నమైన నిర్మాణ శైలితో ఆకట్టుకుంటాయి. అలాంటి ప్రత్యేకమైన ఓ శివాలయం ఈ కథనంలో తెలుసుకుందాం.

### అగస్త్యేశ్వరాలయం

వైఎస్?ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరాలయం చాలా ప్రాచీనమైనది. అతి ప్రాచీన ఈ శివలింగాన్ని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఈ ఆలయాన్ని 8వ శతాబ్దంలో చోళుల కాలంలో, అప్పటి పాలకుడైన నంది చోళుడు నిర్మించినట్లుగా ఆలయంలో శాసనాల ద్వారా తెలుస్తోంది. అటు తర్వాత 15వ శతాబ్దంలో విజయనగర సేనాని నరస నాయకుడు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశాడు. ఈ ఆలయం నాలుగు ద్వారాలతో, అరుదైన శిల్పకళతో, ప్రత్యేక పూజా విధానాలతో ప్రసిద్ధి చెందింది.

### స్థల పురాణం

పరమేశ్వరుని ఆజ్ఞ ప్రకారం కాశీ నుంచి దక్షిణ భారతానికి బయల్దేరిన అగస్త్య మహర్షి, తన దక్షిణదేశ యాత్రలో భాగంగా అనేక ప్రాంతాల్లో శివలింగాలను ప్రతిష్ఠించాడు. అందులో ఈ ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర లింగం కూడా ఒకటి.

ఆకట్టుకునే ఆలయ నిర్మాణ శైలి

అగస్త్యేశ్వరాలయం 140 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పు కలిగి నలుదిక్కులా నాలుగు ద్వారాలతో ఉంటుంది. ఇక్కడ ప్రధాన దైవం అగస్త్యేశ్వర స్వామి కాగా, దేవేరి రాజరాజేశ్వరీ దేవి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా పశ్చిమాన ఉన్న రాజగోపురంపై అయిదు బంగారు కలశాలను ప్రతిష్ఠించారు. తూర్పున కూడా మరో రాజగోపురం ఉంటుంది. ఉత్తర దక్షిణ రాజగోపురాలపై కూడా బంగారు కలశాలను దర్శించవచ్చు.

ఆలయ విశేషాలుఇక్కడ అగస్త్యేశ్వర స్వామి ఆలయంతో పాటు భ్రమర లింగేశ్వర, సుందరేశ్వర, కోదండరామ ఆలయాలు కూడా వెలసి ఉన్నాయి. అలాగే ప్రత్యేక నవగ్రహ మండపం ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామికి, విడివిడిగా ఆలయాలున్నప్పటికీ రెండు ఆలయాలను కలిపే మండపం మాత్రం ఒకటే ఉండడం విశేషం. గర్భాలయంలో అగస్త్యేశ్వర స్వామితో పాటు వీరభద్ర, వినాయక, కార్తికేయ సన్నిధులు ఉన్నాయి. ఇక్కడ కార్తికేయుడు నెమలి వాహనంపై ఉండడం విశేషం.

అరుదైన నవగ్రహ మండపాలు

అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహ మండపాలు సాధారణంగా ఇతర ఆలయాల్లో ఉండే మాదిరిగా కాకుండా ప్రత్యేకంగా ఉంటాయి. విలక్షమైన ఇలాంటి నవగ్రహ మూర్తులను ఒక్క కర్ణాటకలో రాష్ట్రంలోనే చూడవచ్చునని అంటారు.

వీరభద్రమూర్తిఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వెలసి ఉన్న వీరభద్ర స్వామి సమభంగ నిల్చుని దర్శనమిస్తాడు. ఈ స్వామి కాళ్ల కింద మేక తల ఉండడం విశేషం.రససిద్ధి గంటలు

గర్భాలయంలో వెలసి ఉన్న అగస్త్యేశ్వర స్వామి లింగంపై రససిద్ధికి సంబంధించిన గంటలు ఉండటం . ఇది చాలా అరుదైన విశేషం.

### సత్కవులతో సంబంధం

తెలుగునాట వెలసి ఉన్న కొన్ని ఆలయాలతో కవులకు మంచి సంబంధం ఉంటుంది. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్రవిష్ణువు ఆలయంలో శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద రచించాడని అంటారు. అలాగే ఈ ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి ఓ కవికి కూడా సంబంధం ఉన్నట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ఆ క్షేత్ర మహిమకు ముగ్ధుడైన 20 వ శతాబ్దపు కవి సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు తమ గేయకావ్యం 'శివతాండవాన్ని' ఇక్కడే రచించినట్లుగా ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఇందుకు జ్ఞాపకార్థంగా ఆ మహాకవికి ఒక స్మారక చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేయడం ఆలయ విశిష్టతకు అద్దం పడుతుంది.ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయ సందర్శన వల్ల దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం అవుతాయని విశ్వాసం.ఎలా చేరుకోవాలి?ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు వెలసి ఉన్న అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి మెరుగైన రవాణా సౌకర్యాలున్నాయి.మనం కూడా అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి శివానుగ్రహాన్ని ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో ప్రజాదర్బార్




**గజపతినగరం, సెప్టెంబర్ 11,** రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గ నల్లమూలల నుండి విచ్చేసిన 30 మంది దరఖాస్తుదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ దరఖాస్తుదారుల నుండి తీసుకున్న వినతులను అధికారులు పరిష్కరించేలా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించినట్లు శ్రీదేవి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించటమే ప్రజాదర్బార్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, ఓ ఎస్ డి శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి కులాయి నిమిత్తం 479.63 కోట్లు

### ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లకు కృతజ్ఞతలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, సెప్టెంబర్ 11,**



ఇంటింటికి కులాయి నిమిత్తం జల జీవన్ మిషన్ నుండి హర్ ఘర్ జల్ పథకంలో 479.63 కోట్లు మంజూరు చేయటం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 1329 గృహాలకు గాను 711 పనులకు గాను నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నిధులతో హర్ ఘర్ జల్ పథకాన్ని 2029 నాటికి నూరు శాతం వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్ లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికి కులాయి నిమిత్తం 479.63 కోట్లు

ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లకు కృతజ్ఞతలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబర్ 11,

ఇంటింటికి కులాయి నిమిత్తం జల జీవన్ మిషన్ నుండి హర్ ఘర్ జల్ పథకంలో 479.63 కోట్లు మంజూరు చేయటం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 1329 గృహాలకు గాను 711 పనులకు గాను నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నిధులతో హర్ ఘర్ జల్ పథకాన్ని 2029 నాటికి నూరు శాతం వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్ లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# రెండో రోజు శాంతిభద్రతలపై జరిగిన సమీక్ష



**అమరావతి** సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు శాంతిభద్రతలపై జరిగిన సమీక్షకు హాజరైన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల దర్యాప్తు, ఫోరెన్సిక్ సేవలు, పోలీసుల స్పందన వేగం, కన్విక్షన్ రేట్ పెంపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

# వినాయకచవితి ఉత్సవాల సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు,

**ఏలూరు, సెప్టెంబర్, 11 :**

వినాయకచవితి ఉత్సవాల సమయంలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వినాయకచవితి ఉత్సవాల సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు, ఎన్నికలు, ఎస్ఐఆర్, కొత్త సామాజిక పెన్షన్ దరఖాస్తులు, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ కార్యాలయం నుండి శుక్రవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లతో జేసీ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ మట్టి వినాయకులను భక్తిశ్రద్ధలతో పూజించి పర్యావరణానికి మేలు కలిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వినాయకచవితి ఉత్సవాల సమయంలో, నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను ఏర్పాటుచేసి, వినాయకచవితి



ఉత్సవాల సమయంలో బాణాసంచా, విద్యుద్ఘాతం వంటి ప్రమాదాలు జరగకుండా, నిమజ్జన సమయంలో ముఖ్యంగా ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా అనధికార నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఒకేరోజు ఎక్కువ సంఖ్యలో నిమజ్జనాలు జరగకుండా చూడాలన్నారు. బెల్ట్ షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా సామజిక పెన్షన్ల కోసం 16 వేల 316 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి దరఖాస్తులను పరిశీలించి ఎంపిడిఓ లాగిన్ కి పంపాలన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితాలో సవరణలు, అభ్యంతరాలపై అందిన దరఖాస్తులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. ఓటర్ల తుది జాబితా పేర్లను పరిశీలించి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల లాగిన్ కి పంపాలని జేసీ ఆదేశించారు. ఈనెల 12వ తేదీన జిల్లాలో నిర్వహించే ప్రత్యేక జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొనే అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ లు లక్ష్మి ప్రసన్న, రమణ, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్ఓ, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, రెవిన్యూ అధికారులు, సిబ్బంది ప్రభృతులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం: మంత్రి కందుల దుర్గేష్

- ●విశాఖపట్నంలో ఎంఎస్ఎంఈల బిజినెస్ ఎక్స్ పో -2026 ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- ●విశాఖలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఘనంగా ప్రారంభమైన ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిజినెస్ ఎక్స్‌పో.. 13 వరకు నిర్వహణ
- ●పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ●ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మీవీజులు, స్టార్టప్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి సహకారం.. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రాణించే వారికి సదవకాశం :మంత్రి దుర్గేష్
- ●ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్



**విశాఖపట్నం**

విశాఖపట్నం: విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ నిర్వహిస్తోన్న "ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో-2026" ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరిగే ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల ప్రొడక్ట్ స్టాళ్లను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, స్టార్టప్ తదితర ఒక్కో స్టాల్ నిర్వాహకులతో ప్రత్యేకంగా మాట్లాడి, ఉత్పత్తులు, వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోలో మొత్తం 187 స్టాళ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రతినిధులను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో మీవీజులు, స్టార్టప్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని పెంచడం, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా "ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29)" విధానాన్ని అమలు చేస్తోంది. ఈ పాలసీ ద్వారా 2030 నాటికి "ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త" అనే వినూత్నమైన దృక్పథాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ద్వారా ఐదేళ్లలో రూ. 50,000ల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. 1.75 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 మైక్రో పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సరైన గైడెన్స్, కన్సల్టెన్సీ సేవలు అందిస్తూ, వారి వ్యాపారాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీవీజులకు ప్రత్యేక వింగ్స్ ద్వారా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న వైజాగ్ నగరంలో ఇలాంటి బిజినెస్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేయడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంచి మార్గదర్శకత్వం లభిస్తుంది. అంతేగాక ఒక ప్రైవేట్ సంస్థగా ఉన్న ఏపీ చాంబర్ షాప్ కామర్స్ ప్రభుత్వ ఆర్థికపర, విధానపరమైన ఆలోచనను తద్వారా సహకారం అందించేందుకు ఒక కామన్ ప్లాట్ఫారం ఈ బిజినెస్ ఎక్స్ పో ద్వారా తీసుకువచ్చింది. ఈ ఎక్స్ పోలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను విస్తరిస్తూ, తమ ఉత్పత్తులకు తమ కంపెనీని ప్రమోట్ చేసుకొని కొత్త కొత్త ఆలోచనలతో మరింత ముందుకు వెళ్లి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి." అని పేర్కొన్నారు.భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... "పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం పర్యాటకంగా, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. త్వరలోనే వైజాగ్ నగరంలో 16 ఫైవ్ స్టార్ హోటళ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. పర్యాటక అభివృద్ధికి ఈ ఎక్స్‌పోలు ఎంతో దోహదపడతాయి." అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల వ్యాపారవేత్తలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రత్యేక గ్రీవెన్స్‌కు 136 అర్జీలు

- ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి
- అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య

**నందిగామ, సెప్టెంబర్ 11, 2026**

ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 136 అర్జీలను స్వీకరించడం జరిగిందని.. ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నారు.ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. నందిగామ-మధిరరోడ్డులోని ఆర్.ఎస్.గార్డెన్స్ నందు జరిగిన ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య.. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 136 అర్జీలు అందగా వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 69, పంచాయతీరాజ్‌కు 19, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డుకు 15, పట్టణ పరిపాలనకు 9, విద్యుత్‌కు 5, సర్వేకు 4, రహదారులు-భవనాల శాఖకు 4, విద్యా శాఖకు 3 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా వైద్య ఆరోగ్యం శాఖకు 2, గృహ



నిర్మాణం శాఖకు 2, పోలీసు, డ్వామా, రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజల చెంతకే అధికారులు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరించే లక్ష్యంతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్షల విజయవంతానికి పటిష్ఠ సమన్వయం
- డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం



**విజయవాడ, సెప్టెంబర్ 11, 2026**
ఈ నెల 13వ తేదీన జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ; కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీనరసింహం.. యూపీఎస్సీ అబ్జర్వర్ భాను జోషితో కలిసి లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల13వ తేదీ ఆదివారం విజయవాడలోని అయిదు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 691 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు 1,019 మంది మొత్తం 1,710 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఎస్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు సెషన్-1, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు సెషన్-2, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు సెషన్-3 జరగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు సంబంధించి సెషన్-1 ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకు సెషన్-2 మధ్యాహ్నం 2 గం. నుంచి సాయంత్రం 4.30 గం. వరకు జరుగుతుందని వివరించారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని.. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని.. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, రవాణా సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని డీఆర్‌వో లక్ష్మీనరసింహం, శాఖల అధికారులకు సూచించారు.

# ఈ నెల 12న విజయవాడలో క్రిటికల్ కేర్ బ్లాక్, ఐపీహెచ్ ల్యాబరేటరీల ప్రారంభోత్సవం

- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు నాయుడు
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






**విజయవాడ, సెప్టెంబర్ 11, 2026**
విజయవాడ పాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (Old GGH) లో ఉదయం 11:00 గంటల నుంచి 11:25 గంటల మధ్య జరిగే క్రిటికల్ కేర్ బ్లాక్, ఐపీహెచ్ఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అక్కడ నుంచి 11:30 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికకు చేరుకుంటారు. 11:30 నుంచి మధ్యాహ్నం 1:25 గంటలకు జేపీ నడ్డాతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాకులు, ఐపీహెచ్ ల్యాబరేటరీలు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శుక్రవారం రాత్రి ఓల్డ్ జీజీహెచ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనకు సంబంధించి వేదిక, భద్రత, పార్కింగ్, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు ముగిసింది

- అక్టోబరు 5 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబరు 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ





**విజయవాడ: సెప్టెంబర్ 11,2026.**
జిల్లాలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రి)లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నిర్ణయించిన గడువు గురువారం అర్ధరాత్రితో (10.09.2026) ముగిసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, బదిలీ అయిన వారు, ఇతర కారణాల వల్ల అనర్హులైన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం-6 కింద మొత్తం 40,802 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ఇప్పటికే 27,224 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన దరఖాస్తులను కూడా ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరణించిన, బదిలీ అయిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా ఇతర కారణాల వల్ల అనర్హులైన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఫారం-7 కింద మొత్తం 21,023 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నివాస మార్పులు, ఓటరు గుర్తింపు కార్డు రీప్లేస్‌మెంట్, ఓటరు జాబితాలోని వివరాల సవరణలు, ఇతర మార్పుల నమోదు కోసం ఫారం-8 కింద 44,638 దరఖాస్తులు అందినట్లు డా.జి.లక్ష్మీశ తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండకుండా, ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరిచే దిశగా ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అందిన దరఖాస్తులతో కలిపి ప్రస్తుతం ఫారం-6కు సంబంధించిన 10,330 దరఖాస్తులు, ఫారం-7కు సంబంధించిన 982 దరఖాస్తులు, ఫారం-8కు సంబంధించిన 7,447 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను నిర్ణీత నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ అక్టోబరు 5, 2026 వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ పత్రాలలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన 1,94,681 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటికే 1,83,300 మంది ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. సంబంధిత ఓటర్లు సమర్పించిన పత్రాలు, వివరాలను అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లలో, అవసరమైన సరైన పత్రాలు సమర్పించకపోవడం మరియు నిబంధనలకు అనుగుణంగా అర్హతను నిరూపించుకోలేకపోవడం వంటి కారణాలతో 6,280 మందిని అనర్హులుగా తేల్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కేసును నిబంధనల మేరకు పరిశీలించిన తరువాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటున్నామని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం 2026 అక్టోబరు 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాను పారదర్శకంగా మరియు తప్పులులేకుండా రూపొందించడం ఎన్నికల యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

# హైదరాబాద్ వాసులకు అలర్ట్.. ఈ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్:** ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సెప్టెంబరు 12 నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అవసరాన్ని బట్టి వాహనాల దారి మళ్లింపులు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. వాహనాల దారి మళ్లింపువీవీ విగ్రహం నుంచి వచ్చే వాహనాలను నిరంకారి జంక్షన్ వైపునకు మళ్లించనున్నట్లు పోలీసులు తెలిపారు. పాత పీఎస్ సైఫాబాద్ నుంచి బడా గణేశ్ వైపు వాహనాలకు అనుమతి లేదన్నారు. రాజ్‌దూత్ లేన్ వద్ద ఇక్బాల్ మినార్ వైపు వాహనాలను మళ్లించనున్నట్లు చెప్పారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు ట్రాఫిక్‌కు ఆంక్షలు ఉండనున్నట్లు పేర్కొన్నారు. మింట్ కాంపౌండ్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు వాహనాలను దారి మళ్లించనున్నట్లు వెల్లడించారు. నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు ట్రాఫిక్‌కు ఆంక్షలు ఉండనున్నట్లు తెలిపారు. నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు వాహనాలను మళ్లించనున్నట్లు వివరించారు. అలాగే, నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వాహనాలకు అనుమతి లేదన్నారు. ఖైరతాబాద్ పోస్ట్ ఆఫీస్ వద్ద పాత పీఎస్ సైఫాబాద్ మీదుగా దారి మళ్లించనున్నట్లు చెప్పారు. రద్దీకి అవకాశం ఉండే ప్రాంతాలివే
ఖైరతాబాద్, షాదాన్ కాలేజ్, అయోధ్య ప్రాంతాల్లో భారీగా వాహనాల రద్దీకి అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిరంకారి, సైఫాబాద్, మింట్ కాంపౌండ్‌లో ట్రాఫిక్ జామ్‌కు అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్‌లోనూ రద్దీ ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. నెక్లెస్ రోటరీ, కేసీపీ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ వైపు ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. భక్తులకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలుమరోవైపు, భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో వాహనదారులకు పార్కింగ్ సదుపాయం కల్పించినట్లు పోలీసులు తెలిపారు. నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు భక్తులకు రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐమ్యాక్స్ పక్కన హెచ్ఎండీఏ పార్కింగ్‌లో వాహనాలకు అవకాశం ఉందన్నారు. ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోనూ పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు వచ్చే భక్తులకు విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ సదుపాయం ఉందన్నారు. భక్తులకు రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐమ్యాక్స్ భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వాహనదారులు, భక్తులకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# తెలంగాణ సచివాలయం (హైదరాబాద్)లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి (AO-1) మరియు యాxణజ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ - పరిశ్రమ భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి (AO-2) ఏసీబీ (ూాజడీ) వలలో చిక్కారు.

**జ్యోతి శ్వేతఅమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**
, ఫిర్యాదుదారుకు ఒక అధికారిక పనిని (అంటే, ముఖ్యమంత్రి సహాయ నిధి - జవీ=ఖీ పథకం కింద వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయడం, మంజూరైన రూ. 2,00,000/- మొత్తానికి చెక్కును జారీ చేయడం మరియు మిగిలిన క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేయడం) చేసిపెట్టేందుకు గాను రూ. 1,00,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా, ఏసీబీ (సిటీ రేంజ్-××) అధికారులు నిందితులైన శ్రీ ఆనందేశి రాఘవేందర్ (ూూ-1: సచివాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి) మరియు శ్రీ మేడి వినోద్ (ూూ-2: యా×ణజ సీనియర్ అసిస్టెంట్)లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతకుముందు, ూూ-1 ఫిర్యాదుదారు నుండి ూూ-2 ద్వారా ఫోన్‌పే (గ్రాష్ట్రశీఅవూవ) లావాదేవీ రూపంలో రూ. 5,000/- లంచాన్ని డిమాండ్ చేసి స్వీకరించారు.ూూ-2 ఫిర్యాదుదారు నుండి రూ. 1,00,000/- లంచం మొత్తాన్ని స్వీకరించి, దానిని ూూ-1కి అందజేశారు. లంచం సొమ్ము అయిన ఆ రూ. 1,00,000/-నుూూ-1 వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, నిందితులైన అధికారులు అక్రమ ప్రయోజనం పొందేందుకు తమ విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందువల్ల, ఈ నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని కేసుల గౌరవనీయులైన మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి (× ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది.



భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి. సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్-ఫ్రీ నంబర్):ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు ూజడీ యొక్క టోల్-ఫ్రీ నంబర్ '1064'ను సంప్రదించాలని కోరడమైనది. అలాగే, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (ుఅశ్రీఖఅస్తుఉఖ ూజడీ) మరియు శ/ట్విట్టర్ ద్వారా కూడా తెలంగాణ ూజడీని సంప్రదించవచ్చు. ప్రజలు ూజడీని సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ూజడీ యొక్క ు= కోడ్ ప్రదర్శించబడింది. ఫిర్యాదుదారు లేదా బాధితుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. పి.ఆర్.ఓ., అవినీతి నిరోధక శాఖ (ూాజడీ), తెలంగాణ, హైదరాబాద్.

# మళ్లీ పూర్తి రిథమ్ సాధించా..



**- భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్**

శ్రీలంక టూర్ సందర్భంగా తన బౌలింగ్ వేగం, రిథమ్ పడిపోవడంపై భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ పెదవి విప్పాడు. రెండు నెలల పాటు ఆటకు పూర్తిగా దూరంగా ఉండటం వల్లే క్రీజులో ఇబ్బంది పడ్డానని, అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయడం ద్వారా తిరిగి పాత లయను అందుకున్నానని తెలిపాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ సాధారణంగా వేసే 140 కిలోమీటర్ల వేగానికి బదులు కేవలం 120ల వేగంతోనే బంతులు విసిరాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 44 ఓవర్లు వేసినప్పటికీ బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయాడు. దీనిపై దులీప్ ట్రోఫీ ఫైనల్ అనంతరం సిరాజ్ మాట్లాడుతూ, "రెండు నెలల సుదీర్ఘ బ్రేక్ తర్వాత నేరుగా మ్యాచ్‌లోకి అడుగుపెట్టడంతో నా రిథమ్ దెబ్బతింది. నేను పూర్తిగా రిథమ్‌పై ఆధారపడే బౌలర్‌ని. శరీర కదలికలు సమన్వయంలో లేకపోతే క్రీజులో వేగం చూపించలేను. నా రన్‌అప్‌లో కొన్ని అడుగులు చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా పడటంతో ఫ్లో మిస్సయి పేస్ తగ్గింది" అని వివరించాడు. జూన్ 8న అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ ముగిసిన తర్వాత రెండు నెలల విశ్రాంతి తీసుకుని ఆగస్టు 7న శ్రీలంక పర్యటనకు సిరాజ్ వెళ్లాడు. అయితే చేపాక్‌లో ఈస్ట్ జోన్‌తో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్ తరఫున 41 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ద్వారా రాబోయే కఠినమైన సీజన్‌కు తన శరీరం పూర్తిగా సిద్ధమైందని సిరాజ్ భావిస్తున్నాడు. "ఇక్కడ అంతా దారికొచ్చింది, దాంతో సహజంగానే పేస్ పెరిగింది. కొలంబో టెస్ట్ తర్వాత కేవలం వారం రోజుల్లోనే చెన్నైకి వచ్చి భానుడి ప్రతాపంలో బౌలింగ్ చేయడం చాలా కష్టమనిపించింది. కానీ దేశానికి ఆడుతున్నప్పుడు ఎలాంటి సాకులు చెప్పకూడదు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్లు రాకపోయినా, పడిన కష్టం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తప్పక ఫలితాన్ని ఇస్తుంది. నా పదేళ్ల కెరీర్‌లో ఎప్పుడూ రెండు నెలల బ్రేక్ తీసుకోలేదు. నా శరీరం ఎక్కువ ఓవర్లు వేస్తేనే మెరుగ్గా స్పందిస్తుంది" అని అన్నాడు. ఈ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యర్థి ఈస్ట్ జోన్ తరఫున ఆడిన తన పాత భాగస్వామి మహమ్మద్ షమీతో సిరాజ్ కాసేపు మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి షమీ స్పందిస్తూ, "మొదటి ఇన్నింగ్స్‌లో సిరాజ్ తన సహజమైన రిథమ్ కోసం ఇబ్బంది పడ్డాడు. మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే నీ సహజమైన బలాలపై మాత్రమే దృష్టి పెట్టాలని అతడికి గుర్తుచేశాను. రన్‌అప్, రిథమ్ సరిగ్గా కుదిరితే లైన్ అండ్ లెంగ్త్ ఆటోమేటిక్‌గా సెట్ అవుతాయి" అని తెలిపాడు. సీనియర్ బౌలర్ ఇచ్చిన సలహాలు సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా బౌలింగ్ చేయడానికి తోడ్పడ్డాయి. పూర్తి ఫిట్‌నెస్‌తో పాటు రన్‌అప్ గాడిన పడటంతో రాబోయే న్యూజిలాండ్ సిరీస్‌లో సిరాజ్ మునుపటి వాడివేడి బంతులతో చెలరేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజెంట్ సిరాజ్.. ఎక్కువగా అంతర్జాతీయ టెస్టులు మాత్రమే ఆడుతున్నాడు.

# రంజీ ట్రోఫీ షెడ్యూల్ మార్పులపై గవాస్కర్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూపొందించిన దేశవాళీ షెడ్యూల్‌పై టీమ్ ఇండియా దిగ్గజ మాజీ సారథి సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెడ్ బాల్ టోర్నీ రంజీ ట్రోఫీని బోర్డు చిన్నచూపు చూస్తోందని విమర్శించాడు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం రంజీ ట్రోఫీని రెండు దశలుగా విభజించి, వాటి మధ్యలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ షెడ్యూలింగ్ గందరగోళంపై స్పోర్ట్‌స్టార్ కాలమ్‌లో గవాస్కర్ స్పందిస్తూ, "ఒక వైట్ బాల్ టోర్నమెంట్ కోసం రెడ్ బాల్ టోర్నమెంట్‌ను మధ్యలోనే ఎలా ఆపేస్తారు? ఇది ఆటగాళ్ల రిథమ్, మొమెంటమ్‌ను పూర్తిగా నాశనం చేస్తుంది" అని ఆవేదన చెందాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని సెప్టెంబర్‌లోనే నిర్వహించవచ్చని, కానీ ఐపీఎల్ వేలానికి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఇలా చేస్తోందని గవాస్కర్ విమర్శించాడు. "రంజీ ట్రోఫీ తరహాలోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కూడా క్వార్టర్ ఫైనల్ వరకు ఆడి, కొద్ది వారాల విరామం తర్వాత సెమీస్, ఫైనల్స్ నిర్వహించవచ్చు కదా? అలా చేయరు. ఎందుకంటే ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఒకవేళ వేలం రెండు నెలల తర్వాత జరిగినా ఫ్రాంచైజీలు ప్రతిభావంతులైన ఆటగాళ్లను మరిచిపోరు" అని అతడు తెలిపాడు. ఆట అసలు సిసలైన పునాది అయిన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌ను పక్కనపెట్టి లీగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదని తెలిపాడు. ప్రస్తుత బీసీసీఐ వ్యవస్థలో అనుభవం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్లే ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వస్తున్నాయని గవాస్కర్ విమర్శించాడు. గతంలో బోర్డులో టెక్నికల్ కమిటీ, ఫిక్చర్స్ కమిటీ ఉండేవని గుర్తుచేశాడు. "గతంలో మాజీ ఆటగాళ్లు, సీనియర్ అంపైర్లు, అనుభవజ్ఞులైన నిర్వాహకులు ఆ కమిటీల్లో సభ్యులుగా ఉండి మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేలా చూసేవారు. అలాంటి అనుభవజ్ఞుల సేవలను మళ్లీ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత భారత క్రికెట్ వ్యవస్థ కాస్త దారితప్పింది, సరైన నిపుణుల సలహాలతో దాన్ని సరిచేయాలి" అని సూచించాడు. టెస్ట్ క్రికెట్‌కు ఆటగాళ్లను అందించే రంజీ ట్రోఫీ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలని, షెడ్యూలింగ్‌లో నిలకడ లేకపోతే యువ క్రికెటర్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.

# బ్యాటింగ్ లైనప్‌పై టీమిండియాకు తలనొప్పే

**సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్**



అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకోవడం టీమిండియాకు తలనొప్పేనని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తిలక్ వర్మను ఏ స్థానంలో ఆడిస్తారని, అతని ఎంపిక సవాల్‌గా మారుతుందని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌లో తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహాలు నెలకొన్నాయని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. ఆరు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో 3-0తో సిరీస్‌ను గెలుచుకుంది. సెప్టెంబర్ 13 నుంచి సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అనంతరం జపాన్‌తో చారిత్రాత్మక టీ20తో పాటు అక్కడే జరిగే ఆసియా గేమ్స్ 2026లో పాల్గొననుంది. టీమిండియా కాంబినేషన్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్.. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. 'బ్యాటర్లను ఎంపిక చేయడంలో కచ్చితంగా కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ ఉన్నారు. ఇక్కడే టీమ్ కాంబినేషన్ ఎంచుకోవడం కొంచెం కష్టం అవుతుంది.

తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు? ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత తిలక్ వర్మ 10 ఇన్నింగ్స్‌ల్లో 159.36 స్ట్రైక్‌రేట్‌తో 255 పరుగులు చేశాడు. అయితే అతను కేవలం మూడు సార్లు మాత్రమే 50 పరుగుల మార్కును దాటాడు. ఇది అతని బ్యాటింగ్‌లోని నిలకడలేనితనాన్ని సూచిస్తుంది. ఇది చాలా బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సరైన సమతుల్యతను సాధించడం కష్టం. ఇది టీ20 మ్యాచ్ కాబట్టి, వారు జట్టులోని చిన్న మార్పులు చేసి ఆడవ చ్చు. ఆటగాళ్ల పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అఫ్గాని స్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతు న్నందుకు ప్రతీ ఆటగాడి బాధ్యతను గుర్తు చేయడం చాలా కీలకం.'అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.

# ఫైనల్లో సబలెంకా, రిబకినా

- సెమీస్‌లో ఓడిన అమెరికా అమ్మాయిలు
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2026



**న్యూయార్క్ (యుఎస్ఏ):** యుఎస్ ఓపెన్‌లో బెలారస్ భామ తిరుగులేని జోరు కొనసాగుతుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో వరుస సెట్లలో విజయం సాధించిన అరినా సబలెంకా మహిళల సింగిల్స్‌లో వరుసగా నాల్గో సారి టైటిల్ పోరుకు చేరుకుంది. 7-5, 6-2తో అమెరికా అమ్మాయి, మూడో సీడ్ జెస్సికా పెగులాపై టాప్ సీడ్ అరినా సబలెంకా గెలుపొందింది. న్యూయార్క్‌లో మరోసారి జెస్సికా పెగులాను చిత్తు చేసిన సబలెంకా.. ఇక్కడ వరుసగా 19వ విజయం నమోదు చేసింది. ఏడు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అరినా సబలెంకా.. జెస్సికా పెగులాపై ఏకపక్ష విజయం సాధించింది. తొలి సెట్లో సర్వ్ నిలుపుకున్న జెస్సికా పెగులా.. సబలెంకాకు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. కానీ 5-5తో స్కోరు సమంగా ఉన్న వేళ వరుసగా రెండు గేములు గెలుపొంది సబలెంకా తొలి సెట్‌ను ఖాతాలో వేసుకుంది. రెండో సెట్లో పెగులా డీలా పడిగా.. సబలెంకా దూకుడు పెంచింది. పాయింట్ల పరంగా 65-54తో సబలెంకా పైచేయి సాధించింది. గేముల పరంగా 13-7తో పెగులాను చిత్తు చేసింది. హార్డ్‌కోర్ట్ క్వీన్‌గా దూసుకెళ్తున్న సబలెంకా యుఎస్ ఓపెన్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసింది. ఈ ఏడాది ఆశించిన ప్రదర్శన చేయని సబలెంకా.. 99 వారాల తర్వాత వరల్డ్ నం.1 ర్యాంక్ చేజార్చుకునే ప్రమాదంలో పడింది.కానీ, శనివారం నాటి మహిళల సింగిల్స్ ఫైనల్లో విజయం సాధిస్తే టైటిల్‌తో పాటు వరల్డ్‌నం.1 ర్యాంక్ సబలెంకా సొంతం కానుంది.మహిళల సింగిల్స్‌లో మరో సెమీఫైనల్లో అమెరికా స్టార్ క్రీడాకారిణి కొకొ గాఫ్‌పై కజకిస్తాన్ అమ్మాయి ఎలెనా రిబకినా విజయం సాధించింది. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో నాల్గో సీడ్ కొకొ గాఫ్‌పై రెండో సీడ్ ఎలెనా రిబకినా 3-6, 6-4, 6-4తో గెలుపొందింది. ఎలెనా రిబకినా ఐదు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. కొకొ గాఫ్ నాలుగు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 88-82తో రిబకినా, గాఫ్ హోరాహోరీగా పోటీపడ్డారు. రిబకినా 15 గేములు నెగ్గగా, కొకొ గాఫ్ 14 గేమ్‌లతో గట్టి పోటీ ఇచ్చింది. తొలి సెట్లో విజయంతో కొకొ గాఫ్ ముందంజ వేసినా.. వరుసగా రెండు సెట్లలో పైచేయి సాధించిన ఎలెనా రిబకినా టైటిల్ పోరుకు చేరుకుంది. **ఫైనల్‌కు చేరేదెవరో** పురుషుల సింగిల్స్‌లో ఫైనల్స్ రేసు రసవత్తరంగా మారింది. తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్, జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో రష్యా ఆటగాడు కరెన్ కచనోవ్ తలపడనున్నాడు. భీకర ఫామ్‌లో ఉన్న జ్వెరెవ్‌ను ఢీకొట్టడం కరెన్‌కు అంత సులువు కాదు. మరో సెమీఫైనల్లో అమెరికా ఆటగాళ్లు ఫ్రాన్సెస్ తియాఫో, బెన్ షెల్టన్ పోటీపడుతున్నారు. బెన్ షెల్టన్ క్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్‌కు షాక్ ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించాడు. నేడు సహచర ఆటగాడు ఫ్రాన్సెస్‌తో సెమీఫైనల్లో షెల్టన్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు.




# ఫైనల్లో యువ భారత్

**- మెన్స్ జూనియర్ హాకీ ఆసియా కప్**

**మోకి (చైనా) :** 2026 జూనియర్ మెన్స్ హాకీ ఆసియా కప్‌లో టీమ్ ఇండియా ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం చైనాలోని మోకిలో జరిగిన తొలి సెమీఫైనల్లో మలేషియాపై భారత్ 3-1తో ఘన విజయం సాధించింది. కెప్టెన్ అన్మోల్: ఎక్కా రెండు గోల్స్ నమోదు చేయగా, సుఖ్విందర్ సింగ్ ఓ గోల్ కొట్టాడు. మలేషియాకు రాహుల్ ఊరట గోల్ అందించాడు. రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్, దక్షిణ కొరియా తలపడనుండగా.. విజేతతో భారత్ టైటిల్ వేట సాగించనుంది.

# ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్..




**హైదరాబాద్ :** మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22ి) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24ి), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది. రేపు (సెప్టెంబరు 11) జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

# తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల నాకు వచ్చిన ప్రయోజనం ఏమీ లేదు: ఉదయభాను

ప్రముఖ యాంకర్, నటి ఉదయభాను టాలీవుడ్ పరిశ్రమలో తన ప్రస్తుత పరిస్థితిపై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఒక ప్రముఖ మీడియా ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే తనకు పరిశ్రమలో ఆఫర్లు తగ్గిపోయి, క్రమంగా అవకాశాలు లేకుండా పోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో తెలంగాణ నేపథ్యం ఉన్న కథలు, సినిమాలు ఎక్కువగా వస్తున్నా... కేవలం ప్రాంతీయ నేపథ్యం ఉన్నంత మాత్రాన అవకాశాలు వచ్చేయవని ఆమె స్పష్టం చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకముందే తాను బుల్లితెరపై అత్యధిక షోలు, ఎన్నో ఈవెంట్లు చేశానని ఉదయభాను గుర్తుచేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్థానిక నటిగా తనకు ఎలాంటి అడ్వాంటేజ్ లభించలేదని, చివరికి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా తనను హోస్ట్‌గా పిలవలేదని వాపోయారు. తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల తనకు వచ్చిన ప్రయోజనం సున్నా అని ఆమె అభివర్ణించారు.దేవుడు ఇచ్చిన ప్రతిభతోనే పరిశ్రమలో తనని తాను నిలబెట్టుకున్నానని, సినిమాల్లో కొన్ని అవకాశాలు వచ్చినా సరైన కథలు లేకపోవడం వల్లే తాను నిరాకరించానని తెలిపారు. సీనియర్ హీరో రాజశేఖర్ సినిమాలో సాంగ్ తర్వాత తనకు అనేక ఆఫర్లు వచ్చినప్పటికీ, కొన్ని వ్యక్తిగత హద్దులు, నిబంధనలు పెట్టుకోవడం వల్ల వాటిని అంగీకరించలేదని వివరించారు. ప్రస్తుతం తాను సినీ నిర్మాణ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నానని, కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే నటనకు మాత్రం స్వస్తి చెప్పలేదని, ఇంప్రెస్ చేసే మంచి కథలు వస్తే కచ్చితంగా నటిస్తానని ఉదయభాను స్పష్టం చేశారు.





# ఇంటెన్స్ లవ్ స్టోరీ, పీరియడ్ ఫిలింస్ చేయాలని ఉంది

## : రకుల్ ప్రీత్ సింగ్

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు.

ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు.ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది

# విజయాలు చాలా చూశా..

## కానీ 'ఇరుముడి' నాకు ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టింది: రవితేజ



మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లో 'జనరేషనల్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్' పేరుతో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ, ఈ చిత్రం తనకు ఒక నటుడిగా ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. "నా సినీ ప్రయాణంలో ఎన్నో విజయాలు, పరాజయాలు చూశాను. కానీ ఒక కళాకారుడిగా సమాజంలో నాకు లభించిన గౌరవానికి 'ఇరుముడి' ప్రత్యేక కారణమైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే, నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని, అపారమైన గౌరవాన్ని సంపాదించుకోవడం మరో ఎత్తు. ఈ సినిమా నాకు ఆ అనుభూతిని ఇచ్చింది. డిస్ట్రిబ్యూటర్ల ముఖాల్లో కనిపించిన సంతృప్తి నాలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది" అని అన్నారు.ఈ ఘనతకు అసలైన కారణం దర్శకుడు శివ నిర్వాణ అని రవితేజ ప్రశంసించారు. "సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఆయన పడిన శ్రమ వర్ణనాతీతం. రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేస్తూ మమ్మల్ని నడిపించారు. నా కెరీర్‌లో ఇంతగా నైట్ షూటింగుల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. జీవీ ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ఆత్మలా నిలిచింది" అని కొనియాడారు. ఈ విజయోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకులు అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బుచ్చిబాబు సానా ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ డివోషనల్ అండ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. సాయికుమార్, చిన్నారి నక్షత్ర కీలక పాత్రల్లో అద్భుతమైన నటనతో మెప్పించారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.

# నాలుగు నెలలు ఉండగానే




## అనిల్ సందడి షురూ..!

2027 సంక్రాంతికి అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు మల్టీస్టారర్‌గా తెరకెక్కించి సక్సెస్ దక్కించుకున్న అనిల్ రావిపూడి ఇప్పుడు మళ్లీ ఈ సినిమాను మల్టీస్టారర్‌గా రూపొందిస్తున్నాడు. వెంకటేష్‌తో పాటు తన మొదటి సినిమా హీరో కళ్యాణ్ రామ్‌ను ఈ సినిమాలో నటింపజేయడం వల్ల అనిల్ రావిపూడి మరోసారి సక్సెస్ ఫార్ములా వెంట నడుస్తున్నాడు. అనిల్ రావిపూడి తన ప్రతి సినిమాకు ఏదో పెద్ద హంగామా చేయకుండా,

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. టీజర్‌కు టైమ్ ఫిక్స్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది.ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




# గ్లోబల్ స్టార్స్ కోసం వేట.

## . సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక..

ప్రస్తుతం 'రణబాలి' చిత్రంతో బిజీగా ఉన్న రష్మిక మందన స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' (న్దీజు). ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్‌లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ (ఒఖ), న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది.ఇక, సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో తీవ్రమైన కరువు నెలకొన్న నేపథ్యంలో తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడు అనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com